ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 7 జూన్ 2025



డీఎస్సీ రాత పరీక్షలు ప్రారంభం

తొలి రోజు ఏడు కేంద్రాల్లో నిర్వహణ ▸ 88.39 శాతం హాజరు

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ రాత పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో తొలిరోజు ఏడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 2,447 మంది అభ్యర్థులకుగాను 2,163 మంది (88.39 శాతం) పరీక్షకు హాజరయ్యారు. నాన్ లాంగ్వేజ్ కేటగిరీలో గణితం, ఫిజికల్ సైన్స్ (ఆంగ్ల మాధ్యమం), లాంగ్వేజ్ కేటగిరీలో తెలుగు, హిందీ సబ్జెక్టులకు రాత పరీక్ష ... మిగతా 8వ పేజీలో

రేషన్ బియ్యం పక్కదారి

పౌరసరఫరాల గోదాము నుంచి రైస్ మిల్లులకు...

- ఆనందపురం మండలం పెద్దిపాలెంలో రెండు మిల్లులపై భీమిలి ఆర్డీవో నేతృత్వంలో దాడులు
- 82.4 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం
- అనకాపల్లి, విజయనగరం జిల్లాల గోదాముల నుంచి వచ్చిన సరుకుగా నిర్ధారణ
- శ్రీబాలాజీ, శ్రీసాయి రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు
- రెండింటినీ సీజ్ చేసిన అధికారులు



ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని శ్రీబాలాజీ రైస్ మిల్లులో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, ఆనందపురం తహశీల్దారు శ్యాంప్రసాద్

విశాఖపట్నం/ఆనందపురం/భీమునిపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల గోదాముల నుంచి రేషన్ డిపోలకు వెళ్లాల్సిన బియ్యాన్ని దారిమళ్లించిన వ్యవహారం బట్టబయలైంది. పక్కా సమాచారంతో భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ నేతృత్వంలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు గురువారం రాత్రి ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని శ్రీబాలాజీ, శ్రీసాయి రైస్ మిల్లులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 82.33 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇందులో పౌర సరఫరాల గోదాముల నుంచి నేరుగా వెళ్లిన బియ్యం 55.12 టన్నులు, ఇతర మార్గాల ద్వారా సేకరించింది 22.318 టన్నులు, పాలిష్ చేసి రాశులుగా పోసి ఉన్నది ఐదు టన్నులుగా గుర్తించి, సీజ్ చేశారు. శ్రీబాలాజీ రైస్ మిల్లులో గోదాముల నుంచి వెళ్లిన బియ్యం 24.4 టన్నులు, ప్లాస్టిక్ బ్యాగులలో వచ్చినవి 21.4 టన్నులు, పాలిష్ చేసినవి ఐదు టన్నులు ఉన్నాయి. శ్రీసాయి రైస్ మిల్లులో పౌర సరఫరాల గోదాముల నుంచి వెళ్లినవి 30.75 టన్నులు, ప్లాస్టిక్ బ్యాగులలో ఉన్నవి 0.918 టన్నులు స్వాధీనం చేసుకున్నారు. కాగా పౌర సరఫరాల గోదాముల నుంచి వెళ్లిన 106.7 టన్నుల బియ్యానికి సంబంధించిన ఖాళీ సంచులను గుర్తించారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన రెండు మిల్లులపై 7-ఎ క్రిమినల్ కేసు నమోదుచేశామని భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ తెలిపారు. అక్రమ నిల్వలను ఆనందపురం పౌర సరఫరాల గోదాముకు తరలించిన తరువాత మిల్లులను సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఆనందపురం తహశీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు. దాడుల సందర్భంగా ఒక వ్యాన్‌ను, ఆటోను సీజ్ చేశారు.



మిల్లులో రేషన్ బియ్యం బ్యాగులు

అనకాపల్లి, విజయనగరం నుంచి రేషన్ బియ్యం

అనకాపల్లి, విజయనగరం జిల్లాల పౌర సరఫరాల గోదాముల నుంచి రేషన్ డిపోలకు వెళ్లాల్సిన బియ్యాన్ని రైస్‌మిల్లులకు తరలించినట్టు ఆర్డీవో, ఇతర అధికారులు గుర్తించారు. బియ్యం సంచులపై ఉన్న లేబుల్ ఆధారంగా అనకాపల్లి, విజయనగరం జిల్లాల పౌరసరఫరాల గోదాముల నుంచి వచ్చినట్టు నిర్ధారించారు. ఇంకా డిపోల్లో కార్డుదారులకు డీలర్లు కిలోకు ఇంత అని లెక్కగట్టి డబ్బులిస్తుంటారు. అలా సేకరించిన బియ్యాన్ని బస్తాలకు ఉండే సీల్ విప్పకుండా చిరు వ్యాపారులకు విక్రయిస్తే...వారు రైస్‌మిల్లులకు అమ్ముతున్నట్టు గుర్తించారు. ఈ సమాచారాన్ని అనకాపల్లి, విజయనగరం జిల్లాల పౌరసరఫరాలకు తెలియజేయాలని అధికారులు నిర్ణయించారు. లేబుళ్ల ద్వారా ఏఏ డిపోలకు చెందిన సరుకో నిర్ధారణ చేసుకున్న తరువాత వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల అధికారులకు సూచించనున్నారు. గోదాముల నుంచి రైస్ మిల్లులకు సరుకు రవాణాలో కీలకపాత్ర పోషించే వ్యాన్ డ్రైవర్లపై కేసులు నమోదుచేయాలని ఆయా జిల్లాల ... మిగతా 8వ పేజీలో

విశాఖ కేంద్రంగా ఎకనామిక్ రీజియన్

అనకాపల్లి, అల్లూరి సహా ఎనిమిది జిల్లాలతో ఏర్పాటు

- పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం సుమారు లక్ష ఎకరాలు సమకూర్చనున్న ప్రభుత్వం
- విశాఖ-కాకినాడ మధ్య బీచ్ రోడ్
- 2028-30 నాటికి విశాఖ మెట్రో ప్రాజెక్టు

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నానికి సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించనున్నట్టే...ఇటు వైపు కాకినాడ వరకూ బీచ్ రోడ్డును నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశించారు. దీనిని జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని సూచించారు. అమరావతిలో శుక్రవారం జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో విశాఖ కేంద్రంగా ఎనిమిది జిల్లాలతో ఏర్పాటుచేయబోయే 'ఎకనామిక్ రీజియన్'పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఏయే జిల్లాలంటే...?

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలను ఎకనామిక్ రీజియన్‌గా ఏర్పాటు చేస్తారు. ఈ జిల్లాల్లో ఆర్థిక వ్యవహారాలు పెరిగేలా...తద్వారా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెంది, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటారు. ఈ రీజియన్‌లో వివిధ పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం సుమారు లక్ష ఎకరాలను సమకూరుస్తారు. ఐటీ రంగంలో లక్షల మందికి ఉపాధి కల్పించేలా స్టార్టప్‌లు, డేటా సెంటర్లు, ఇన్నోవేషన్ కేంద్రాలు నెలకొల్పుతారు. పోర్టులు, ఐటీ, పర్యాటకం, హెల్త్ కేర్, వ్యవసాయం, పట్టణీకరణ రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆయా రంగాలపై దృష్టి పెట్టాలని సూచించారు. 2028-30 నాటికి విశాఖపట్నంలో 77 కి.మీ. పొడవున మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

ఆగిన రోడ్డు పనులు

వడ్డాది- గరికబంద మధ్య వాహనదారులు, ప్రయాణికుల పాట్లు

- ఆరు నెలల క్రితం రూ.12 కోట్లతో విస్తరణ, అభివృద్ధి పనులు మొదలు
- జూన్‌నాటికి పూర్తిచేయాలని ఒప్పందం
- ఆది నుంచీ మందకొడిగానే పనులు నిర్వహించిన కాంట్రాక్టర్
- వారం రోజుల నుంచి పూర్తిగా నిలిపివేత
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



డి.సురవరం వద్ద రోడ్డు పక్కన కంకర కుప్పలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో రహదారుల అభివృద్ధి పనులు నత్తతో పోటీ పడుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో అత్యంత ముఖ్యమైన చోడవరం నియోజకవర్గంలో బీఎన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను ఎప్పుడో అటకెక్కించేశారు. మరో ప్రధానమైన వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు ఇటీవల వరకు మందకొడిగా సాగ్గా.. వారం రోజుల క్రితం పనులను పూర్తిగా ఆపేశారు. వాస్తవంగా ఈ నెలాఖరునాటికి పూర్తికావాల్సిన ఈ రోడ్డు పనులు ఇంతవరకు 30 శాతం మాత్రమే అయ్యాయి.

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి మాడుగుల మండలం మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వేలాది మంది ప్రజలు, వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. మాడుగుల మండలం తాటిపర్తి నుంచి పాడేరు వరకు దాదాపు కొండప్రాంతం (ఘాట్) కావడంతో రహదారి బాగానే వుంది. అయితే వడ్డాది నుంచి తాటిపర్తి వరకు సుమారు 14 కిలోమీటర్ల రహదారి నిర్వహణ విషయంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. కనీసం గోతులు కూడా కప్పకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వడ్డాది నుంచి తాటిపర్తి వరకు ప్రయాణించడానికి అటుఇటుగా 30 నిమిషాలు పడుతుంది. కానీ



ఘాటీ రోడ్డు జంక్షన్- తాటిపర్తి మధ్య జరుగుతున్న బెర్మ్ పనులు (ఫైల్ ఫొటో)

రోడ్డు మొత్తం గోతులు ఏర్పడడంతో గంటసేపు ప్రయాణించాల్సి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో కొన్నిచోట్ల సిమెంట్ కాంక్రీట్ మిక్సర్‌తో మొక్కుబడిగా గోతులు కప్పి చేతులు దులుపుకున్నారు. తరువాత కురిసిన వర్షాలకు కాంక్రీట్ మిక్సర్ కొట్టుకుపోయి, రాళ్ల పిక్కలు పైకి తేలాయి. దీంతో ద్విచక్రవాహనదారులకు ఇబ్బందులు మరింత పెరిగాయి.

ఇదిలావుండగా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వడ్డాది-గరికబంద రోడ్డు విస్తరణ, అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సమారు 14 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి ... మిగతా 8వ పేజీలో

గుమ్మిడిగొండలో వైరల్ జ్వరాలు

- గ్రామంలో 50 మందికిపైగా బాధితులు
- ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థుల వినతి



జ్వరంతో బాధపడుతున్న సుర్ల వరహాలమ్మ

నాతవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిడిగొండ గ్రామం లో వైరల్ జ్వరాలు విజృంభించాయి. శుక్రవారం సాయంత్రానికి 50 మందికిగా జ్వరాలతో బాధపడుతున్నారు. కొద్ది రోజుల నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాయడం, ఆ తరువాత వాతావరణం మారిపోయి వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు వైరల్ జ్వరాలబారిన పడుతున్నారని ఆర్‌ఎంపీ వైద్యులు అభిప్రాయపడుతున్నారు. కాగా గుమ్మిడి గొండలో వైరల్ జ్వరాలు ప్రబలినప్పటికీ వైద్య సిబ్బంది ఇటువైపు కన్నెత్తి అయినా చూడలేదని, కనీసం ఏఎన్ఎంలు కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తున్నదని వాపోతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది ఉపాధి హామీ పథకం కూలీలే వున్నారని చెబుతున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి గుమ్మిడిగొండలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వడగాడ్పులు.. వర్షాలు!

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లాలో మాడుగుల, చోడవరం, అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం తరువాత ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఉరుములతో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. ఈదురుగాలుల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంతకుముందు మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాయడంతోపాటు వడగాడ్పులు వీచాయి. ఉక్కపోతతో జనం విలవిలలాడారు. ఆ తరువాత వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం చెందారు.



దేవరాపల్లి మండలం బండారుపాలెంలో విరిగిన ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం

జిల్లాలో భిన్న వాతావరణం

- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీక్షణంగా కాసిన ఎండ
- వడగాడ్పులు, ఉక్కపోతతో జనం విలవిల
- మధ్యాహ్నం తరువాత ఈదురుగాలులతో వర్షం
- పలుచోట్ల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- వాతావరణం చల్లబడడంతో ఉపశమనం



జలమయమైన తుమ్మపాల మెయిన్‌రోడ్డు

అనకాపల్లి పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. 21.8 ఎం.ఎం.గా వర్షపాతం నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. అనకాపల్లి మండలంలోని తుమ్మపాల, దిబ్బపాలెం, సత్యనారాయణపురం, పిసినికాడ, మార్టూరు, కొత్తూరు, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయం అయ్యాయి. డ్రైనేజీ కాలువలు పూడుకుపోవడంతో వర్షం నీరు రోడ్లపై ప్రవహించింది. అనకాపల్లి-చోడవరం రోడ్డులో పలుచోట్ల నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ఎలమంచిలిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాడుపగిలేలా ఎండకాసింది. ఆ తరువాత వాతావరణం మారిపోయి ఈదురుగాలులతో వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ఎండ తాపం నుంచి ప్రజలు ఉపశమనం చెందారు. పరవాడ, ఫార్మాసిటీ, వాడచీపురుపల్లి, ఎన్టీపీసీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం సుమారు అరగంటపాటు మోస్తరు వర్షం కురిసింది. మాడుగుల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గాలులు వీచడంతో వాతావరణం చల్లబడిది. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట ... మిగతా 8వ పేజీలో



కృష్ణాపురం వద్ద బోల్తాపడిన బస్సు

కృష్ణాపురం వద్ద బస్సు బోల్తా

సెజ్‌లోని ఒక కంపెనీకి మహిళా కార్మికులను తీసుకెళుతుండగా ఘటన

- నలుగురికి తీవ్రగాయాలు, 20 మందికి స్వల్ప గాయాలు

ఎలమంచిలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): **అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని ఒక దుస్తుల తయారీ పరిశ్రమలో పనిచేసే మహిళా కార్మికులు ప్రయాణిస్తున్న బస్సు శుక్రవారం తెల్లవారుజామున ఎలమంచిలి మండలం కృష్ణాపురం సమీపంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, సుమారు 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, క్షతగాత్రులు తెలిపిన వివరాలిలా వున్నాయి.**



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

ఎలమంచిలి మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళలు అచ్యుతాపురం సెజ్‌లోని ఒక ప్రముఖ దుస్తుల తయారీ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం 'ఏ' షిఫ్ట్ ... మిగతా 8వ పేజీలో

ఆర్ అండ్ బి స్థలానికి రక్షణ కరవు

సరిహద్దు పునాదుల గోడ తవ్వేసిన వెనుక స్థలం యజమాని

- ఐదు నెలల క్రితం ఘటన
- తాజాగా రెండు స్థలాలను కలిపేసి కంచె వేసిన వైనం
- రూ.3 కోట్ల విలువచేసే భూమిని నిర్లక్ష్యంగా వదిలేసిన అధికారులు



మెయిన్ రోడ్డుని ఆనుకొని ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలం

నర్సీపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): **పట్టణంలో మెయిన్ రోడ్డుని ఆనుకొని కోట్లాది రూపాయల విలువ చేసే ఆర్‌అండ్‌బీ స్థలం పరిరక్షణ విషయంలో ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రైవేటు వ్యక్తికి ధారాదత్తం చేయడానికి అనుకూల వాతావరణ కల్పించారా? అన్న అనుమనాలు వ్యక్తం అవుతున్నాయి.**

నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులో ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి ఎదురుగా మెయిన్ రోడ్డుని ఆనుకొని ఆ శాఖకు 10 సెంట్ల స్థలం ఉంది. దీని వెనుక ఒక ప్రైవేటు స్థలం ఉంది. ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణకు గురికాకుండా ఈ రెండు (ఆర్‌అండ్‌బీ, ప్రైవేటు వ్యక్తి స్థలం) స్థలాల మధ్య నాలుగేళ్ల క్రితం రాతి పునాది నిర్మాంచారు. అయితే ఆరు నెలల క్రితం ప్రైవేటు స్థలానికి చెందిన వ్యక్తులు, ఆర్‌అండ్‌బీ స్థలానికి హద్దుగా నిర్మించిన రాతి పునాదిని తవ్వేసి ... మిగతా 8వ పేజీలో

కోడూరు ఎంఎస్‌ఎంఈలో ఆరు నెలల్లో ఉత్పత్తులు

ఔత్సాహికులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

- ఎమ్మెల్యే కొణతాలతో కలిసి పార్కు ప్రారంభం



ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభించిన కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక పార్కులో స్థలాలు పొందిన వారు వెంటనే యూనిట్ల ఏర్పాటు పనులు మొదలు పెట్టి ఆరు నెలల్లో ఉత్పత్తిని ప్రారంభించాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. మండలంలోని కోడూరులో రూ.59.47 కోట్లతో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈ పార్కును ఎమ్మెల్యే ... మిగతా 8వ పేజీలో

గ్రంథాలయంలో ముగిసిన వేసవి విజ్ఞానశిబిరం


విజ్ఞాన శిబిరం ముగింపోత్సవంలో విద్యార్థులతో అతిథులు

ఎలమంచిలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో పౌర సేవా సంఘం అధ్యక్షుడు పుల్లా వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించడం ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చునన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పశ్చిమ బెంగాల్ ఖాదీ సీఈవో డి.అనురాధ, ఐ.ఎస్. జవహర్‌లు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం నలభై రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పౌరసేవా సంఘం సభ్యులు కె.సత్యారావు, డి.కాళిదాసు, టి.పాపారావు, ఆకేళ్ల మూర్తి, విశ్రాంత అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఆడారి పూరి జగన్నాథం, ఎస్‌కే అబ్దుల్లా, వై.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆవ కాలువలో గేట్లు, రక్షణ గోడ నిర్మాణం ప్రారంభం



పనుల ప్రారంభోత్సవంలో సంస్థ అధికారులు, నాయకులు

మునగపాక, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఆవ కాలువలో గేట్లు, రక్షణ గోడల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయనున్నామని ఏషియన్ పెయింట్స్ జీఎం అనిల్ తెలిపారు. మునగపాకలోని మూల బందగోడి, పాటిపల్లిలలో శుక్రవారం గేట్లు, రక్షణగోడ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నామన్నామన్నారు. ఇందులో భాగంగా సాగు నీటి కాలువలకు సంబంధించి రైతుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, సర్పంచ్‌లు ఆడారి కృష్ణవేణి, త్రిమూర్తులు, దిమ్మల అప్పారావు, ఎ.వి.సత్యనారాయణ, ఆడారి గోవింద, కాశీశ్వరరావు, దాడి శివ, దొడ్డి గంగసూరి, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, ములబందగోడి రైతులు పాల్గొన్నారు.

'రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి'

మునగపాక, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ సాగు దిశగా అడుగులు వేయాలని కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు సూచించారు. మండలంలోని చూచుకొండ, గణపర్తి గ్రామాల్లో శుక్రవారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ సాగు వల్ల సాగుదారులకు, ప్రజలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం పచ్చిరొట్ట ఎరువులు వల్ల ఉపయోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆషాదేవి, వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్

» అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్ » పర్యాటక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సూచించాలని సూచన


నియోజవకర్గంలోని వివిధ శాఖల అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలతో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. ఇక్కడి ఎస్‌ఈజడ్‌లోని లారెస్ అడ్మిన్ కార్యాలయంలో శుక్రవారం నియోజవర్గంలోని వివిధ శాఖల అధికారులతో ఏర్పాటైన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎలమంచిలి నియోజకవర్గాన్ని అన్నిరం గాల్లో అగ్రగామిగా నిలిపేందుకు విజన్ యాక్షన్‌ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. ప్రధానంగా పర్యాటక రంగంలో భాగంగా కొండకర్ల ఆవ, సీతపాలెం, పూడిమడక, తంతడి, లోవపాలెం, వాడరాంబిల్లి సముద్ర తీరాలు ,అయా ప్రాంతాలకు వెళ్లే రోడ్లు, పంచదార్ల ధర్మలింగే శ్వర స్వామివారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అధికారులు సమష్టిగా పనిచేసి నియోజకవర్గానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకు రావాలని సూచించారు. ఈ నెల తొమ్మిదో తేదీని రాంబిల్లి మండలం కొత్తూరులోని ధనదిబ్బలు వద్ద జరిగే యోగాకు అధికారులంతా విధిగా హాజరుకావాలన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మోసయ్యపేటలో పర్యటన

అచ్యుతాపురం: గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే విజయకుమార్ సూచించారు. మోసయ్యపేటలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్నది వర్షా కాలమని గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మురుగు ఎక్కడా నిల్వ లేకుండా చూడాలని సూచించారు. అచ్యుతాపురంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తున్నామని వివరించారు. ఆయన వెంట పుర్రే శ్రీనివాసయాదవ్ తదితరులు

ఉదయం నుంచి ఎండ మండే.. సాయంత్రం వాన కురిసె..


ఎండ ధాటికి మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న ఎలమంచిలి ప్రధాన జంక్షన్, సాయంత్రం వర్షం కురుస్తున్న దృశ్యం

ఎలమంచిలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఎండలు మండిపోతుండడంతో జనం అల్లాడిపోతున్నారు. గత మూడు రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చుతుండడంతో ఇంటి నుంచి బయట అడుగు పెట్టాలంటేనే హడలిపోతున్నారు. బయటకు వచ్చినవారు సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి మూడు గంటల వరకు చాలాచోట్ల రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ఇదే వాతావరణం కొనసాగినప్పటికీ సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఎలమంచిలి పరిసర మండలాల్లో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై వర్షం కుసిరింది. దీంతో అంతటా ఒక్క సారిగా చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

లోవపాలెంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి వినతి

రాంబిల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జడ్.చింతువా పంచాయతీ లోవపాలెంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, జడ్.చింతువా గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెల్లూరి ఆనంద్, బూత్ ఇన్‌చార్జి గనగళ్ల కోదండరామ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కొండవారపాలెంలోని సబ్‌స్టేషన్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కొన్ని నెలలుగా లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా కోరారు.

మురుగు తరగదు.. పాలకుల మనసు కరగదు..!


కాలువలు లేక గ్రామంలోని సీసీ రోడ్డపై నిలిచిపోయిన వర్షపు నీరు

» లోవపాలెంలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ
» సీసీ రోడ్లు ఏర్పాటు చేసినా.. కాలువల నిర్మాణంపై అలక్ష్యం
» ఎక్కడికక్కడ వాడుక, వర్షపు నీరు నిలిచిపోతుండడంతో అవస్థలు

రాంబిల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్.చింతువా పంచాయతీ లోవపాలెంలో మురుగు తిష్ఠ వేస్తోంది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మత్స్యకార గ్రామమైన ఇక్కడ సుమారు రెండు వేలకుపైగా జనాభా నివాసం ఉంటున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించినప్పటీ కాలువల నిర్మాణం జరగలేదు. దీంతో వాడుక నీరు, వర్షపు నీరు రోడ్లపైకి చేరుతోంది. ఇది రోజల తరబడి నిలిచిపోతుండడంతో మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కారణంగా దోమలు పెరిగిపోయి రాత్రి వేళ కంటిమీద కునుకు ఉండడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారని అంతా వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తమ గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

రైల్వే జోన్‌కు జీఎం నియామకం శుభపరిణామం

రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ



అచ్యుతాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమించడం శుభ పరిణామం అని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన రైల్వే జోన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వ హయాంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రైల్వేజోన్ తొలి జీఎంను నియమించడం శుభపరిణామన్నారు. ఇందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరాంధ్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైల్వే జోన్ పనులు ఆలస్యమయ్యాయన్నారు. జోన్‌కి అవసరమైన 54 ఎకరాల భూమిని గత ప్రభుత్వం సమకూర్చ లేకపోయిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ముడసర్లోవలో స్థలం కేటాయించిందన్నారు. రూ.149 కోట్లతో తొమ్మిది అంతస్తుల రైల్వే జోన్ ప్రధాన కార్యాలయాన్ని నిర్మాణం చేస్తారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రధాని నరేంద్రమోదీని కలిసి రాష్ట్రాభివృద్ధికి నిధులు తెస్తున్నారన్నారని వివరించారు.

ఘనంగా కామాక్షిదేవి కల్యాణం



మునగపాక, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగులాపల్లిలో కామాక్షిదేవి కల్యాణాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. పద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అందుబాటులో వరి విత్తనాలు

అచ్యుతాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు సిద్ధంగా ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి బి.శంకరగోవింద్ తెలిపారు. శ్రీకాకుళం సన్నాలు 500క్వింటాళ్లు, బీపీటీ 5204 (సాంబమసూరి)29,ఎంటీయూ 1021 (ఇంద్ర) 19, ఎంటీయూ 1318 రకం 29 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు


బహుమతులతో వివిధ పోటీల విజేతలు, సన్మాన గ్రహీతలు

పాయకరావుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శుక్రవారం ఘనంగా ముగిశాయి. పాయకరావుపేటలో ఏర్పాటుచేసిన ముగింపు కార్యక్రమంలో జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం డీఎస్.భవాని మాట్లాడుతూ 40 రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులకు అనేక పాఠాలు, క్రమశిక్షణ, మానవతా విలువలు నేర్పించారని, ఇవి వారికి ఉన్నతికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్లు వై.అచ్యుతరావు, శ్రీనివాసరాజు, ఎస్.సీతారామ్మూర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగిసింది. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో పిల్లల్లో వున్న సృజనాత్మకత, మేధస్సును వెలికి తీసేందుకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.బాలాజీ, ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు యేడిద వెంకట రమణ మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బండారు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి బండారు గోవిందరావు, ఉపాధ్యాయుడు రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో...

కోటవురట్ల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాణిక్యం మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ సేవలను ఉపయోగించుకొని విజానాన్ని పెంచుకోవాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ మదీనా మాట్లాడుతూ ప్రతి రోజూ గ్రంథాలయాన్ని సందర్శించడం ఉన్నత భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు. అనంతరం శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, ఉపాధ్యాయుడు జవ్వాది నరసింగరావు పాల్గొన్నారు.

గోకులపాడులో జలజీవన్ పనులు పూర్తి


నూతనంగా నిర్మించిన ట్యాంకు

ఎస్.రాయవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో మేజరు పంచాయతీ తిమ్మాపురం పరిధిలోని గోకులపాడు గ్రామంలో రూ.68 లక్షలతో చేపట్టిన జలజీవన్ పథకం పనులు పూర్తయినట్టు గ్రామ సర్పంచ్ కర్రి సత్యానారాయణ తెలిపారు. శుక్రవారం తాగునీటి ట్యాంకు కోసం ఏర్పాటు చేసిన బోరును ట్రైల్ వేసి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో పూర్తయిన జలజీవన్ పథకం పనులతో పాటు పలు నూతన నిర్మాణాలను హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదగా ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాయకరావుపేటకు 27,649 పాఠ్య పుస్తకాలు

» యూనిఫారాలు, బ్యాగులు, బూట్లు, సాక్స్ రావాలి
» మండల విద్యా శాఖాధికారి గాంధీ


పాఠశాలలకు ఆటోల్లో పంపుతున్న పాఠ్య, నోట్ పుస్తకాలు

పాయకరావుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 27,649 పాఠ్య పుస్తకాలు వచ్చినట్టు మండల విద్యా శాఖాధికారి కేఎస్.గాంధీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 40 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, 12 ఉన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 5,688 విద్యార్థులు చదువుతుండగా, వీరికి అవసరమైన పాఠ్య పుస్తకాలు 27,649 వచ్చాయని చెప్పారు. అలాగే నోటు పుస్తకాలు 34,794, బెల్టులు 3,615, ఒకటి, ఆరు తరగతుల విద్యార్థులకు నిఘంటువులు 845 వచ్చాయన్నారు. వీటిని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరలించామని ఆయన తెలిపారు. ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభించిన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇంకా మండలానికి విద్యార్థుల యూనిఫారాలు, బ్యాగులు, బూట్లు, సాక్స్‌లు రావాల్సి ఉందన్నారు. అవి వచ్చిన వెంటనే పాఠశాలలకు తరలించి, విద్యార్థులకు అందిస్తామని ఎంఈవో వివరించారు. ఆయన వెంట ఎంఈవో-2 రమేశ్ తదితరులు ఉన్నారు.

తాండవ కాలువ మరమ్మతుకు నిధుల మంజూరు

రూ.9 లక్షలతో పనులు చేపట్టేందుకు ఇంజనీర్ల పరిశీలన


తాండవ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఈఈ బాలసూర్య, ఏఈఈ శ్యామ్‌కుమార్

కోటవురట్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తాండవ కాలువ తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.9 లక్షలు మంజూరు చేసింది. నీలిగుంట, జి.సన్యాసిరాజుపాలెం గ్రామాలకు మధ్యన 15వ కిలోమీటరు వద్ద గెడ్డలో నిర్మించిన అక్విడెక్ట్ వద్ద కెనాల్ మూడేళ్ల క్రితం కొట్టుకుపోయింది. దీంతో జి.సన్యాసిరాజు సుంకపూర్, తంగేడు, లింగాపురం, కోటవురట్ల, రాట్నాపాలెం, కైలాసపట్నం శివారు భూములకు సాగునీరు అందడంలేదు. ఈ సమస్యను స్థానిక టీడీపీ నాయకులు వేచలపు జనార్దన్, భాస్కరరావు తదితరులు హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మంత్రి స్పందించి ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలకు సాగునీరు అందించేందుకు వీలుగా తాత్కాలిక మరమ్మతుల చేయడానికి రూ.9 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు తాండవ ఈఈ బాలసూర్య, ఏఈఈ శ్యామ్‌కుమార్ తదితరులు శుక్రవారం నీలిగుంట వద్ద తాండవ కాలువ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు వేచలపు భాస్కరరావు, టీడీపీ సీనియర్ నాయకుడు పెట్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలకు దూరం

తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు అబద్ధం

ఎస్. రాయవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తనపై వస్తున్న ఆరోపణలు వాస్తవమని నిరూపిస్తే రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటానని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం స్పష్టం చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడారు. రాజకీయంగా తన ఎదుగుదలను చూసి తట్టుకోలేక కొంత మంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. 103 ఎకరాల దళిత భూములను కబ్జా చేశానని ఓ పత్రిక (ఆంధ్రజ్యోతి కాదు) తప్పుడు కథనం ప్రచురించిందన్నారు. ఆ భూముల వద్దకు విలేకరులను తీసుకువెళ్లి సంబంధిత రైతులతో మాట్లాడించానని, తమ భూమిని ఎవరూ కబ్జా చేయలేదని రైతులే చెప్పారని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో తాను ఎటువంటి అక్రమాలు, అవినీతికి పాల్పడలేదని, అలాగే చేసినట్టు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. అలాగే తన పరువుకు భంగం కలిగిస్తూ తప్పుడు వార్తలు ప్రచురించిన పత్రికపై కేసులు పెట్టడమే కాకుండా కోర్టులో పరువు నష్టం దావా వేస్తానని ఆయన తెలిపారు.

16న దేవదాయ శాఖ ఆలయ భూముల కౌలుకు వేలం పాటలు

పాయకరావుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవదాయ శాఖకు సంబంధించిన వివిధ ఆలయాల భూములకు ఈ నెల 16న వేలం పాటలు నిర్వహిస్తామని పాండురంగస్వామి దేవస్థానం ఈవో దివ్యజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామవరం శ్రీరామ మందిరానికి చెందిన వివిధ సర్వే నంబర్లలో ఉన్న 9.78 ఎకరాల భూములకు మూడు సంవత్సరాల కాలమిరిమికి ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి నామవరం రామాలయంలో వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు. అలాగే సత్యవరం గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన సర్వే నం.160/1, 160/3లలోని 5.08 ఎకరాల భూమికి మూడేళ్ల కాల పరిమితికి మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో వేలం పాట వేస్తామన్నారు. ఆసక్తి గల వారు నిర్దేశించిన దరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చునని ఈవో స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం దేవదాయ శాఖ కార్యాలయంలోని పనివేళల్లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

యోగాంధ్రపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు

నక్కపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో డి.సీతారామరాజు, తహసీల్దార్ నరసింహమూర్తి, వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కె.రఘు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. యోగా అంటే ఏమిటి? యోగా వల్ల ప్రయోజనాలు తదితర అంశాలకు సంబంధించి నిర్వహించిన పోటీల్లో పలు గ్రామాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నరసింగరావు, గురువు డి.రాంబాబు పోటీలను పర్యవేక్షించారు.

ఘనంగా దుర్గమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


వమ్మవరంలో పూజలు అందుకున్న దుర్గమ్మతల్లి

ఎస్.రాయవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం గ్రామంలో దుర్గమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక పెద్దలు, పలు పార్టీల నాయకులు దుర్గమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. మధ్యాహ్నం నుంచి అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

ఫార్మా పొల్యూషన్‌పై త్వరలో చర్యలు

- పరవాడ ప్రాంతంలో ఇదో పెద్ద సమస్యగా మారింది
- ప్రజలు అనారోగ్యం బారిన పడుతుండడం ఆందోళనకరం
- ఏపీ ఆయిల్ సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ బాబ్జీ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న గండి బాబ్జీ

పరవాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ నుంచి వెలువడుతున్న పొల్యూషన్‌పై సత్వరమే చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ స్పష్టం చేశారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరవాడ ప్రాంతంలో పొల్యూషన్ అతి పెద్ద సమస్యగా తయారైందన్నారు. దీనివల్ల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతుండడంతో పాటు అనారోగ్యం బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం జరుగుతుందని వివరించారు. అనంతరం వినతులు స్వీకరించగా, ముఖ్యంగా ఫార్మా పొల్యూషన్, ఎన్టీపీసీ, హిందూజా ప్లాంట్‌లలో ఉపాధి అంశాలపై ఎక్కువమంది వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు చింతకాయల ముత్యాలు, అట్టా సన్యాసి అప్పారావు, గొర్లి కనకారావు, బొండా తాతారావు, పైలా రామచంద్రరావు, దాట్ల గణేశ్, ఇందల కొండలరావు, పైలా చినఅక్కునాయుడు, బొండా సన్నిదేముడు, కూండ్రపు మధు, కరణం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు- పీతపాలెం బీటీ రోడ్డు ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరణలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడూరు నుంచి పీతపాలెం వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.79.42 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోడ్డు లేక ప్రజలు పడుతున్న అవస్థలను గుర్తించి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దుడ్డువాకలో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం ప్రారంభం



కొలువుదీరిన స్వామి.., ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు నిర్వాహకులు సత్కారం

సబ్బవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అయ్యన్నపాలెం శివారు దుడ్డువాక గ్రామంలో సంతాన గోపాలకృష్ణ సహిత స్వయంభూ సుబ్రహ్మణేశ్వర్వ ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పం చకర్ల రమేశ్‌బాబుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సర్పంచ్ బుదిరెడ్ల శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు, గ్రామ పెద్దలు దొగ్గ చం ద్రశేఖర నాయుడు, దేముడు, కూటమి నాయకులు ఇందలి వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, గండి దుర్గాప్రసాద్, బైలపూడి హరగోపాల్, అమరపిన్ని నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'సమస్యల సత్వర పరిష్కారానికే సమన్వయ కమిటీ'



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కశింకోట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సమస్యల సత్వర పరిష్కారమే మండల సమన్వయ కమిటీ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీసుభాషిణి అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటైన కమిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. అనంతరం కశింకోటలో ఇంటి ప్రహరీ గోడకు సంబంధించి ఇరువర్గాల వాదనలు విని, పరిష్కారం చూపాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, ఏఎస్ఐ మణికుమారి, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా ప్రకాశ్



: పాల సంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌ను సత్కరిస్తున్న గొంతిన శ్రీనివాసరావు

కశింకోట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమవరం గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా గూడుపు ప్రకాశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల కేంద్రం వద్ద శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, సభ్యులంతా కలిసి ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పాడి రైతులకు ఎనలేని సేవలందిస్తున్న ప్రకాశ్‌ను అభినందించారు. కూటమి నాయకులు గొంతిన చిరంజీవి, కర్రి దుర్గునాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు, తెరపల్లి శ్రీను, కర్రి నాగసత్య శ్రీను, గొంతిన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

సబ్బవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శాఖ గ్రంథాలయంలో గత నలభై రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ ముగింపోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ గ్రంథాలయాల సందర్శనను విద్యార్థులు అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి వి.శిరీష, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంఈవో-2 రవీంద్ర బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్

- 10 గంటలపాటు సుదీర్ఘంగా సాగిన సమావేశం
- 28 అంశాలు ఆమోదం, ఐదు వాయిదా
- జీవీఎంసీలో ఘోస్ట్ ఉద్యోగులు ఉంటే వారి సంగతి తేల్చండి: ఎమ్మెల్యే పల్లా
- కమిషనర్‌ను నియమించేలా తీర్మానం పంపాలి: ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు
- జీవీఎంసీ ఆస్తులను ప్రైవేటుకు కట్టబెట్టేస్తున్నారని వైసీపీ అభ్యంతరం
- స్పోర్ట్స్ ఎరీనా, ఆక్వా స్పోర్ట్స్‌ను కారుచౌకగా ఎలా కట్టబెట్టారంటూ కూటమి ఎదురుదాడి



సభలో అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్ల నడుమ వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జీవీ ఎంసీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి తొమ్మిది గం టల వరకూ సాగింది. ప్రధాన అజెండాలోని 24 అంశాలతోపాటు టేబుల్ అజెండాలోని నాలుగు అంశాలను కౌన్సిల్ ఆమోదించగా, ప్రధాన అజెండాలోని మూడు అంశాలు, టేబుల్ అజెండాలోని రెండు అంశాలను వాయిదా వేసింది. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారితోపాటు, ఆపరేషన్ సిందూర్‌లో అశువులుబాసిన వీరజవాన్లకు సంతాప తీర్మానాలతో కౌన్సిల్ ప్రారంభమైంది. అనంతరం సమావేశాన్ని ప్రారంభిస్తున్నట్టు మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రకటించగానే ఇన్‌చార్జి కమిషనర్ లేకుండా కౌన్సిల్ సమావేశం జరగడం సరికాదని వైసీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో టీ బ్రేక్ ఇస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. అనంతరం ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ కౌన్సిల్ హాలుకు చేరుకోవడంతో సమావేశాన్ని ప్రారంభించారు. మొదట జీరో అవర్ కావాలని వైసీపీ సభ్యులు కోరడంతో గంటసేపు అవకాశం ఇస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమించినందుకు కూటమి ప్రభుత్వాన్ని అభినందిస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తిగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ, నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ పీలా గోవిందను కౌన్సిల్‌లోకి ఏ హోదాతో అనుమతించారని ప్రశ్నించారు. ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్‌గా ఉన్న ఆయన్ను ప్రత్యేక ఆహ్వానితుడిగా కౌన్సిల్ సమావేశాలకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ వివరణ ఇచ్చారు. జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి మాట్లాడుతూ గతంలో కేకే రాజు, ఆదారి ఆనంద్ వంటి వారు జీవీఎంసీ కార్యకలాపాల్లో జోక్యం చేసుకునేవారని, కూటమి ప్రభుత్వంలో అనధికార వ్యక్తుల జోక్యానికి ఆస్కారం లేదన్నారు. 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ మాట్లాడుతూ తన వార్డులో ప్రభుత్వ భూమి కబ్జా అయిపోతోందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత మాట్లాడుతూ తన వార్డులోని అనేకప్రాంతాల్లో ఆకతాయిలు, చిల్లర దొంగల బెడద ఎక్కువగా ఉన్నందున లైటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్ మాట్లాడుతూ పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్ట్‌ను తొలగిస్తామని ఏడాది కిందట కౌన్సిల్ తీర్మానం చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీలో కూడా కొంతమంది ఘోస్ట్ ఉద్యోగులు ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై అధికారులు దృష్టిసారించి ఉద్యోగానికి రాకున్నా జీతం తీసుకుంటున్నవారి సంగతి తేల్చాలని సూచించారు. గాజువాక నుంచి ఎలమంచిలి వరకూ రాష్ట్ర రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. విశాఖ నగర అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని, త్వరలోనే యువ అధికారిని జీవీఎంసీ కమిషనర్‌గా నియమిస్తారని సభకు తెలిపారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ నాలుగు నెలలుగా కమిషనర్ లేకపోవడం సరికాదని, దీనిపై కార్పొరేటర్లతోపాటు ఎమ్మెల్యేలంతా తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిద్దామని ప్రతిపాదించారు. రోడ్లను తవ్వేసి సరిగా పూడ్చడం లేదని ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్లు 25 శాతం లెస్‌కు ఎలా టెండర్ వేస్తున్నారని, దీనిలో ఇంజనీరింగ్ అధికారుల పాత్రపై ఆరోపణలు ఉన్నాయన్నారు.

మార్టూరులో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- పదుల సంఖ్యలో వాహనాల ద్వారా తరలింపు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



మార్టూరులో యంత్రం ద్వారా అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం



గ్రావెల్ లారీలోకి లోడింగ్

తుమ్మపాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరు రెవెన్యూ పరిధి సర్వే నంబరు ఒకటిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పదుల సంఖ్యలో భారీ వాహనాలతో గ్రావెల్‌ను తరలించుకుపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మైనింగ్ జోన్ మార్టూరులో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్ర మాలకు పాల్పడుతూ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా కొంతమంది గత రెండు రోజులుగా మార్టూరు రెవెన్యూ సర్వే నంబరు ఒకటిలో గ్రావెల్‌ను తవ్వుకుంటూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. పదుల సంఖ్యలో భారీ వాహనాలను ఏర్పాటు చేసి పగలు, రాత్రి తేడా లేకుండా తరలించుకుపోతున్నారు. ప్రశ్నిస్తున్న వారికి, అధికారులకు ముడుపులు ముట్టచెబుతుండడంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయాలు చందాన సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండలను పిండి చేస్తూ లక్షలాది రూపాయల అక్రమ వ్యాపారాలకు తెగబడుతున్న వారిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

శంకరం జాతీయ రహదారిపై విస్తృతంగా వాహన తనిఖీలు



కంటైనర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కొత్తూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం శంకరం జాతీయ రహదారిపై రూరల్ పోలీసులు శుక్రవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ జి. రవి కుమార్ ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన యజమానులకు జరిమానాలు విధించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ విభాగం మేనేజర్ విజయ్‌శేఖర్



సంపద కేంద్రాన్ని పరిశీస్తున్న విజయ్‌శేఖర్ తదితరులు

పరవాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ విభాగం మేనేజర్ విజయ్‌శేఖర్ సూచించారు. మండలంలోని వెన్నెలపాలెం, వాడచీపురుపల్లిలలో గల సంపద కేంద్రాలను శుక్రవారం అధికారులతో కలిసి సందర్శించారు. ఇక్కడ సేకరించిన చెత్తను పరిశీలించారు. ఈ కేంద్రాల ద్వారా సంపద తయారీకి దృష్టి సారించాలన్నారు. చెత్త సేకరణకు క్లాప్‌మిత్రలను నియమించుకోవాలని అధికారులకు సూచించారు. పరిశుభ్రతపై ప్రజలకు మరింత అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జి.షణ్ముఖ, సర్పంచ్ వెన్నెల అప్పారావు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, భారతి, వెలుగు ఏపీఎం రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి : సీఐ



శాంతి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ

అనకాపల్లి టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో శాంతి కమిటీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం జరిగే బక్రీద్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సహకరించాలని కోరారు. మసీదు వీధిలోని జామియా మసీదు అధ్యక్షుడు పీఎస్ఎన్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి పండుగకు శారదానది ఒడ్డున గల ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తామని చెప్పారు. కానీ అక్కడ వాతావరణం బాగోకపోవడంతో మసీదులోనే ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఇళ్లకు చేసి కుటుంబ సభ్యులతో సరదాగా వేడుక జరుపుకుంటామన్నారు. మసీదు వీధి, తుమ్మపాల, శారదానది ఒడ్డున గల ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ వారికి వివరించారు.

కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో హెడ్ కుక్, అసిస్టెంట్ హెడ్‌కుక్, చౌకీదార్ పోస్టులకు రోజువారీ వేతనంతో పని చేసేందుకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో-1 లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల పదోతేదీ లోగా పంపాలని సూచించారు. పూర్తి వివరాల కోసం మండల విద్యాశాఖ కార్యాలలయాన్ని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు



భోజన పథకం నిర్వాహకుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో

సబ్బవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కృషి చేయాలని ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు సూచించారు. ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం భోజన పథకం నిర్వాహకులకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు. కూరగాయలు కోయడంలో, గుడ్లు ఉడకబెట్టడంలో ఎటువంటిలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంటల సమయంలో ఎలా వ్యవహరించాలి, పిల్లలకు ఆహారం వడ్డించే సమయంలో ఎలా ఉం డాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖాధికారి సత్యరాజ్ గ్యాస్, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ మహేశ్, వీఆర్‌పీలు భూలక్ష్మి, కళాభారతి, రమణ, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిత

- శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో కమాండెంట్ ప్రభాత్
- 13 బెటాలియన్ల నుంచి 468 మంది కేడెట్లు హాజరు



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న లెఫ్టినెంట్ ప్రభాత్

సబ్బవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ మాట్లాడుతూ ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. అత్యంత క్రమశిక్షణతో శిక్షణను పూర్తి చేయాలని సూచించారు. వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు మాట్లాడుతూ ప్రతి కేడెట్ ఎన్‌సీసీని వినియోగించుకొని భవిష్యత్తులో రక్షణ రంగంలో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కేంప్ పదిరోజుల పాటు జరుగుతుందన్నారు. డ్రిల్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, ఫిజికల్ ట్రైనింగ్, యోగా, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 13 బెటాలియన్లకు చెందిన వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి 468 మంది కేడెట్లు, సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు, 12 మంది ఎన్‌సీసీ ఆఫీసర్లు, పాల్గొన్నారు.

ఉదయం ఎండవాత.. సాయంత్రం కుండపోత



సత్యనారాయణపురం రోడ్డులో దొంగెడ్డ నుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు



పరవాడలో వర్షం కురుస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్/కొత్తూరు/కశింకోట/ తుమ్మపాల/సబ్బవరం/పరవాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ సాయంత్ర నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై చిరుగాలులతో వర్షం పడడంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. దీంతో అంతా ఉపశమనం పొందారు. అనకాపల్లిలో 21.8 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. వర్షానికి కొత్తూరు ప్రధాన రోడ్డుతో పాటు శారదనగర్‌లోని పలు వీధుల్లో నీరు నిలిచిపోయింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. అలాగే సత్యనారాయణపురం పంచాయతీకి వెళ్లే ప్రధాన రోడ్డులో గల దొంగగెడ్డకు మురుగునీటితో పాటు వర్షపునీరు చేరడంతో రోడ్డుపై ప్రహించింది. భారీ వర్షం కారణంగా రహదారులన్నీ జలమయమైపోయాయి. ప్రధానంగా తుమ్మపాల, దిబ్బపాలెం, మార్టూరు రహదారులు వర్షపునీటితో నిండిపోయాయి. దీంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే, పరవాడ, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు అరగంటపాటు ఏకధాటిగా పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కాగా ఈ వర్షం కూరగాయల పంటలకు ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపిక

కొత్తూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఏఎంఏఎ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయి నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. ఫలితాలు వెలువడడంతో శుక్రవారం పాఠశాల యాజమాన్యం సదరు విద్యార్థులను అభినందించింది. ఎస్.మోహన సాయి, సీహెచ్.యోగేశ్వర్, పి.శశిరేఖ, ఎం.జాషిక, ఎ.సుశాంత్, శ్రీగణేష్‌లు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని కోరిబిల్లి లావణ్య తెలిపారు.

ఉపాధి పనుల్లో అవినీతిపై నిలదీత

» వాడీవేడిగా కొయ్యూరు మండల సమావేశం
» సీడీపీవో తీరుపై ఎంపీపీ ధ్వజం..
» ఎస్ఎస్ఏ జేఈని మార్చాలని తీర్మానం

కొయ్యూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులపై పర్యవేక్షణ లోపం వల్ల అవినీతి పెచ్చుమీరుతున్నందంటూ ఏపీవో అప్పలరాజుపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు అధ్యక్షతన ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలోనిర్వహించిన మండల సమావేశంఆద్యంతం వాడీవేడిగా సాగింది, ఎన్ఆర్ఈజీఎస్ పనుల తీరు, ఐసీడీఎస్ సీడీపీవో వ్యవహార్‌శైలి, సర్వశిక్ష అభియాన్‌లో పాఠశాల భవనాల నిర్మాణంలో జేఈ సత్యనారాయణ నిర్లక్ష్యంపై సభ్యులు మండిపడ్డారు. ఉపాధి పథకంలో మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు ఇటీవల నిర్మించిన తొట్టెలను నీటి వసతి లేని ప్రదేశాల్లో నిర్మించారని, పండ్ల తోటల పెంపకానికి పంపిణీ చేసిన మొక్కలు నాణ్యత లేక చనిపోయాయని ఏపీవో అప్పలరాజును పలువురు సభ్యులు నిలదీశారు. చీడిపాలెం పంచాయతీలో రుద్ర కాసులమ్మ, సాతా బాలమ్మల పేరిట మంజూరు చేసిన ఫారంపాండ్స్ గతంలో నాబార్డు ఆధ్వర్యంలో నిర్మాణాలేనన్నారు. వీటినే తిరిగి చూపించి వచ్చిన నిధులను పంచుకున్నారని స్థానిక ఎంపీటీసీ గంగా భవానీ నిలదీశారు. 10 మంది ఉపాధి పనులకు వెళ్తే 40 మందికి మస్తరు వేసి నిధులు దోచుకున్నట్టు సర్పంచ్ సోమన్నదొర నిలదీశారు. ఈ పనులకు శ్రామికులతో పాటు అదనంగా మరో 20 మసర్లు వేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని డౌనూరు ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. అలాగే, ఇటీవల ఐసీడీఎస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి తనను పిలిచి కింద కూర్చోపెట్టి అవమానించారని సీడీపీవో విజయకుమారిపై ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగే, మండలంలో పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులకు కనీసం మర్యాద ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సర్వశిక్ష అభియాన్‌లో 21 పాఠశాలలకు భవనాలు మంజూరయ్యాయని, వీటి నిర్మాణాలను పట్టించుకోకుండా జేఈ సత్యనారాయణ పత్తా లేకుండా పోయారన్నారు. ఈ స్థితిలో జేఈని మార్చాలంటూ సభలో ఏకగ్రీవ తీర్మానం చేసి కలెక్టరు సమర్పించాలని నిర్ణయించారు. అనంతరం మండల వ్యవసాయ శాఖాధికారి, వాటర్‌షెడ్ పీవో, ఎంఈవో, తహసీల్దారు, ఎస్ఎంఐ జేఈ తదితరులు తమ శాఖల ప్రగతిని సమావేశంలో నివేదించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఎంపీటీసీలు, 33 పంచాయతీల సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నీటితొట్టెల నిర్మాణాలపై ఏపీవోను నిలదీస్తున్న జడ్పీటీసీ సభ్యుడు

జిల్లా సమస్యలపై గిరిజన సంక్షేమ శాఖా మంత్రికి వినతి

పాడేరురూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న సమస్యలపై తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి కోడా వెంకట సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు శుక్రవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా మారిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా, పాడేరులో వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలవడంతో నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం కాకుండా ఉందన్నారు. అలాగే, వివిధ గిరిజన గ్రామాల ప్రజలు రహదారులు, తాగునీరు తదితర సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన శాఖామంత్రిగా పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆమెను కోరామన్నారు.ఈకార్యక్రమంలో కొయ్యూరు మండఅ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి కె.రామ్మూర్తి, రాష్ట్ర ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు సోమెల చిట్టిబాబు, ఉల్లి రామారావు, శోభ శ్రీను, బలరాం, మూర్తి, వెంకటప్రసాద్, పిన్నయ్య, గంతన్నదొర, నారాయణరావు, బుజ్జిబాబు పాల్గొన్నారు.


మంత్రి సంధ్యారాణికి సమస్యలపై వినతిపత్రమిస్తున్న టీడీపీ నేతలు

ఐదు పంచాయతీల సర్పంచుల వినతి

జి.మాడుగుల: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు, తాగు, సాగునీటి సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరుతూ ఏపీ గిరిజన సంక్షేమ ద్వారా మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి శుక్రవారం వినతి పత్రాలు అందజేసినట్లు నుర్మతి సర్పంచ్ సూరిబాబు తెలిపారు. బొయితిలి, నుర్మతి, భీరం గడుతూరు, కోరాపల్లి పంచాయతీల పరిధి గ్రామాలకు తాగునీటి సాగునీరు, సీసీ రహదారుల నిర్మించాలని ఆయా సర్పంచులు కోరారు. అలాగే పలు చోట్ల చెక్ డ్యామ్‌లు లేక రెండు పంటలు పండాల్సిన చోట ఒక్క పంటకే పరిమితమవుతుందని మంత్రికి వివరించారు. వాటి నిర్మాణాలకు సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. మంత్రిని కలిసన వారిలో సర్పంచులు సూరిబాబు, కొండపల్లి అప్పలమ్మ, రత్నకుమారి, టీడీపీ నాయకులు బోయన బాబూరావు, సింహాచలం తదితరులు ఉన్నారు.

ఐదు రోజులు తేలికపాటి వర్షాలు

చింతపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు.

ఈ నెల 11తేదీ వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా రెండు మిల్లీమీటర్లు నుంచి గరిష్ఠంగా 10.9మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు.

177 అక్రమ కట్టడాల తొలగింపునకు నోటీసులు

కొయ్యూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన సర్వేలో మండల కేంద్రంతోపాటు ఆనుకుని ఉన్న మరోమూడు గ్రామాల్లో 177 అక్రమ కట్టడాలను గుర్తించి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై సీసీఎల్ఏ నియామవళి మేర 1971 ఫీల్డ్ మేప్ బుక్(ఎఫ్ఎంబి) ఆధారితంగా సర్వే జరిపినట్టు తెలిపారు. ఈ సర్వేలో కొయ్యూరులో 17, రాజేంద్రపాలెం 105, సురేంద్రపాలెం 7, శింగవరంలో 48 అక్రమ కట్టడాలను గుర్తించామన్నారు. వీరందరికీ నోటీసులు జారీ చేసి, స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని నోటీసులో పేర్కొన్నారు. వారం తర్వాత స్పందించకుంటే తొలగింపు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వివరించారు.

పీవీటీజీలందరికీ పక్కా గృహాలు: ఎంపీడీవో


ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో అర్హులైన పీవీటీజీలందరికీ పక్కా గృహాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్టు స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం లక్కవరపుపేటలో పక్కా గృహాల నిర్మాణాలకు హౌసింగ్‌శాఖ గ్రౌండింగ్ మేళా నిర్వహించింది. గ్రామంలో 90 పక్కా గృహాలకు భూమి పూజచేసి నిర్మాణపనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీలకు పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. గిరిజనులు గృహాలను సకాలంలో నిర్మించుకోవాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్ కె. వీరేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు ఎం. సత్యనారాయణ, ఉప సర్పంచ్ బి. గంగాధర్, ఈవోఆర్‌డీ పాపారావు, హౌసింగ్ ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

14న కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం

పాడేరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో ఈనెల 14వ తేదీన రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బాధితుల అవసరాల మేరకు రక్త నిల్వలు లేని పరిస్థితి నెలకొన్నట్టు చెప్పారు. ఈక్రమంలో రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి అధికారులు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేయాలన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

డుంబ్రిగుడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సానిక శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు ఆట పాటలు, క్రీడలతో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శు క్రవారం ఘనంగా ముగిసింది. గ్రంథాలయ అధికారి సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ ముగింపు వేడుకల్లో ఉపాధ్యాయుడు సింహాద్రి, యూనియన్ బ్యాంకు క్యాషియర్ రమేశ్ పాల్గొని చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. నెల రోజులపాటు విజ్ఞాన శిబిరం ఉ త్సాహంగా సాగింది. కార్యక్రమంలో గ్రంథాలయం సబార్డినేటర్ సుబ్బారావు, చిన్నారులు పాల్గొన్నారు.

కొయ్యూరు సీడీపీవోకు బదిలీ

కొయ్యూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ కొయ్యూరు ప్రాజెక్టు సీడీపీవో పి. విజయకుమారికి ఏలూరు జిల్లా నూజివీడు సీడీపీవోగా బదిలీ చేస్తూ మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. ఈమె స్థానంలో జిల్లాలో రాజవొమ్మంగి ప్రాజెక్టు సీడీపీవో దేవమణిని ఇక్కడ నియమించారు. ఈ మేరకు విజయకుమారి సోమవారం రిలీవ్ కానున్నట్టు తెలిసింది.

రాయితీ విత్తనాల పంపిణీ

సీలేరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు ముందుగానే ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ధారకొండ సర్పంచ్ నడిగొట్ల రాజు అన్నారు. వ్యవసాయాధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో గ్రామంలో శు క్రవారం 50 మంది గిరిజన రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాడి రామన్న, కుటమినాయకులు శోభ, జగన్, పోతురాజు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి జన్మదిన వేడుకలు

పాడేరురూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె నివాస గృహం కుమ్మరిపుట్టులో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల సమయంలో నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల నాయకులతో పాటు అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆమె కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాగంనాయు డు మాస్టార్, సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొట్టగుళ్లి రమేష్‌నాయుడు, పాడేరు వైస్ ఎంపీపీ జి.శివకుమార్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి దన్నేటిపలాసి సురేశ్‌కుమార్, అరకు పార్లమెంట్ మహిళా కార్యదర్శి సభ్యురాలు డిప్పల వెంకటకుమారి, అధికార ప్రతినిధి అల్లంగి సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వర్తన లింగమ్మ, గూడెపు ఉషారాణి, ఐటీడీపీ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్, బీసీ సెల్ అధ్యక్షుడు రొబ్బి రాము, గుత్తులపుట్టుసర్పంచ్ సాగిన బాబూరావుపడాల్, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు కూడి రామునాయుడు, తెలుగు మహిళా అధ్యక్షురాలు కోరాబు రూపావతి, నాయకులు వర్తన నీలకంఠం, వరలక్ష్మి, మర్రి కొండబాబు పాల్గొన్నారు. కొయ్యూరు, జి.మాడుగుల, చింతపల్లి మండల నాయకులు, దారెల పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగస్వామి, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణరాజు, మురళీ, వెంకటరమణ, వర్తక సంఘం నాయకులు బూరెడ్డి నాగేశ్వరరావు, అల్లా, పార్టీ అభిమానులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన టీడీపీ గ్రీవెన్స్‌లో వివిధ గ్రామాలపై సమస్యలపై అందిన వినతులను ఆమె స్వీకరించారు. వీటి పరిష్కారానికి తగిన చర్యలు చేపతామని హామీ ఇచ్చారు.


గిడ్డి ఈశ్వరికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ పాడేరు డివిజన్ నాయకులు


కొయ్యూరు: రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న దొరబాబు తదితరులు

కొయ్యూరులో...

కొయ్యూరు: టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి పుట్టిన రోజు వేడుకలను పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు అభిమానులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. అనంతరం రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ ఈశ్వరి ఇటు వంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో చేసుకోవాలని ఆ కాంక్షించారు. ప్రజలకు సేవచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పండు, బూత్ ఇన్‌చార్జి వెంకటేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

హైవే అధికారుల హామీతో ఆందోళన వాయిదా


హైవే అధికారులతో మాట్లాడుతున్న బాధితుల సంఘం నాయకులు

జి.మాడుగుల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పరిహారం చెల్లింపు, ఇతర సమస్యలపై జాతీయ రహదారి 516ఈ నిర్వాసితులు చేపడుతున్న ఆందోళనను హైవే అధికారుల హామీతో తాత్కాలికంగా విరమించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి బాధితుల సంఘం మండల కన్వీనర్ సీతారామానాయుడు మాట్లాడుతూ, తమ సంఘంతో పాటు ఆదివాసీ గిరిజన సంఘం ఈ నెల 1నుంచి రహదారిలో ఆందోళన చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం హైవే అధికారులు స్పందించి చర్చలు జరిపారన్నారు. రహదారికి అనుకుని పంట కాలువల నిర్మాణం, గ్రామాల్లో తాగునీరు పునరుద్ధరణకు హామీతోపాటు నష్టపోయిన వారికి మిగిలిన పరిహారానికి ఈ నెల 10న జిల్లా కలెక్టర్‌తో చర్చలు అనంతరం తుది నిర్ణయం ప్రకటిస్తామని ఎన్‌హెచ్ అధికారులు స్పష్టం చేశారన్నారు. దీంతో ఆందోళన విరమించినట్టు సీతారామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మనపడాల్, చిరంజీవినాయుడు, రామ్మూర్తినాయుడు, బాబురావు, వెంకటలక్ష్మి, కనకాలమ్మ భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ డిపోల ద్వారా నిత్యావసరాల పంపిణీపై హర్షం


కుమ్మరితోటలో రేషన్ సరకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సీలేరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకారసంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో డీఆర్ డి పోల ద్వారా ప్రతీనెలా రేషన్ సరకులు పంపిణీ చేస్తుండడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ కమ్మరితోట జీసీసీ డిపో సేల్స్‌మెన్ గొర్లె నూకరత్నం ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం వాహనాల ద్వారా పంపిణీ చేసేవారని, కొన్ని ప్రాంతాలకు ఈ వాహనాలు చేరే వీలులేక రేషన్ సరకులుపూర్తిస్థాయిలో పేదలకు అందేవి కావని ఈ సందర్భంగా కూటమి నాయకులు కె.రామ్‌దాస్, పి. సత్యమూర్తి అన్నారు. డీఆర్ డిపోలద్వారా ఒకటో తేదీనుంచి 15వ తేదీ వరకు ఏ సమయంలోనైనా రేషన్ సరకులను ప్రస్తుతం విడిపించుకునే వెసులుబాటు ప్రస్తుతం కలిగిందన్నారు.

చింతపల్లి ఆస్పత్రిలో స్వచ్ఛంద దృష్టి ఐకేర్ తొలగింపు

చింతపల్లి, జూన్ 6 (ఆం ధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛందంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృష్టి ఐకేర్‌ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు తొలగించారు. ఆస్పత్రిలో నెల రోజుల క్రితం కంటి వైద్యనిపుణులు పోస్టుని రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. దీంతో ఎన్‌జీవో సేవలనుతొలగించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ డీపీఎం స్థానిక సూపరింటెండెంట్‌కి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆస్పత్రిలో దృష్టి ఐకేర్ ఎన్‌జీవో నిర్వహిస్తున్న కంటి వైద్య సేవా కేంద్రాన్ని వారం రోజులుగా మూసివేశారు. అలాగే ఏరియా ఆస్పత్రిలో దృష్టి ఐకేర్ ఎన్‌జీవో ఏర్పాటు చేసిన రూ.8.5లక్షల విలువైన అత్యాధునిక పరికరాలను శుక్రవారం తొలగించారు. రోగులకు నూతనంగా నియమితులైన కంటి వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహిస్తు న్నారు. అయితే, ఇప్పుడు పరికరాలు లేకుండా ఆస్పత్రిలో రోగులకు ఏవిధంగా మెరుగైన వైద్యసేవలందిస్తారనేది వేచిచూడాలి.


ఏరియా ఆస్పత్రిలో పరికరాలను తొలగిస్తున్న ఐకేర్ ఎన్‌జీవో ప్రతినిధులు

జర్రెలపాదర్ రోడ్డు పనులు ప్రారంభం


రహదారి పనులు చేపడుతున్న దృశ్యం

ముంచంగిపుట్టు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ జర్రెలపొదర్ గ్రామానికి రహదారి పనులు ప్రారంభమయ్యాయి. ఉపాధి హామీ పథకం నిధులు రూ.15లక్షలతో డుండగూడ నుంచి జర్రెలపొదర్ వరకు చేపడుతున్న ఈ పనులను సర్పంచ్ ధనియా, ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యవతి శుక్రవారం ప్రారంభించారు. ఆయా గ్రామాల గిరిజనులు రహదారి సౌకర్యం లేక రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ టీఏ సుఖదేవ్, వీఆర్‌పీలు నాగరాజు, కృష్ణ, ఉప సర్పంచి రాజు, వైసీపీ నేత దేవ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ముంచంగిపుట్టు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ అన్నారు. మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఎఫ్‌డీపీ వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 58 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు పడి ట్రాఫిక్‌కు అంతరాయం

సీలేరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దుప్పిలివాడ వద్ద గాలీ వర్షానికి రోడ్డుకు శుక్రవారం అడ్డంగా చెట్ల కొమ్మలు విరిగిపడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆ గ్రామ సమీపంలో చెట్లు కొమ్మలు విరిగిపడి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగినట్టు సీలేరు పోలీసులకు సమాచారం అందడంతో ట్రైయినింగ్ ఎస్ఐ బాబీతోపాటు సిబ్బంది ధనరాజ్, సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిపై విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రయాణికులు వారికి అభినందనలు తెలిపారు.


దుప్పిలివాడ సమీపంలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు

విశాఖ రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర ప్రజల కల సాకారం

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

అనంతగిరి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వ హయాంలో సాకారమవుతోందని మాజీ మంత్రి, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. అనంతగిరిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే జోన్ తొలి జీఎంగా సందీప్ మాథుర్‌ను నియమించడం శుభ పరిణామమని అన్నారు. ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. గత ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైల్వే జోన్ పనులు ఆలస్యమయ్యాయని అ న్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైల్వే జోన్ కార్యకలాపాల వేగవంతానికి ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. విశాఖలోని మూడసర్లలోవలో స్థలాన్ని కేటాయించిందన్నారు. రూ. 149 కోట్లతో 9 అంతస్థులతో రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పలుమార్లు ఢిల్లీ వెళ్లి రైల్వే జోన్ సాధించుకువచ్చారన్నారు. గత 12 నెలల్లో రూ. 75 వేల కోట్ల నేషనల్ హైవే ప్రాజెక్టులు, రూ.72 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ముఖ్యమంతి చంద్రబాబు తీసుకువచ్చినట్టు పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్‌పై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఈ సందర్భంగా కిడారి పేర్కొన్నారు.

యోగాతో ఏకాగ్రత


యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్ గౌరీశంకరరావు

పాడేరురూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగాసనాలు సాధన చేస్తే మానసిక ఉల్లాసంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు విద్యార్థులకు సూచించారు. యోగాంధ్రలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోజూ ఉదయం ఫస్టు పిరియడ్‌లో యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆయన విద్యార్థులకు యోగాంధ్రపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థీ రోజుకు రెండు గంటల పాటు యోగా సాధన చేయాలన్నారు. యోగా 2025 థీమ్ వన్ ఎర్త్- వన్ హెల్త్ అనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో పి.మహేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

‘తలబరిసింగికి రహదారి నిర్మించాలి’


జి.మాడుగుల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వంతాల పంచాయతీ మారుమూల తలబరిసింగి గ్రామానికి రహదారి నిర్మించాలని పెసా కమిటీ ఫోరం నాయకుడు ఎల్. రామకృష్ణ ఆధ్వర్యంలో సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఉపాధి సిబ్బందికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మా ట్లాడుతూ, తలబరిసింగి ప్రాంతంలో రహదారి సదుపాయంలో లేక బుధవారం పాము కాటుకు గురైన డిప్పల బుజ్జిబాబుకు డోలీలో తరలించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ స్థితిలో ఉపాధి పథకం ద్వారా రోడ్డు సదుపాయం కల్పించాలని అధికారులను ఆయన కోరారు.


ఉపాధి సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న పెసా కమిటీ ప్రతినిధులు

కోలుకుంటున్న పాముకాటు బాధితుడు

బుధవారం పాము కాటుకు గురైన డిప్పల బుజ్జిబాబును పాడేరు జిల్లా ఆసుపత్రిలో తరలించి వైద్యం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే శుక్రవారం నాటికి అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు స్పష్టం చేశారు.

చిరు వ్యాపారుల జీవనోపాధికి లోపం లేకుండా చూడాలి


తహసీల్దార్‌కి వినతి పత్రమిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, వర్తకులు

చింతపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చిరు వ్యాపారుల జీవనోపాధి దృష్టిలో పెట్టుకుని దుకాణాల ఆక్రమణలు తొలగించాలని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య సూచించారు. గురువారం స్థానిక చిరువ్యాపారులతో కలిసి ప్రజా ప్రతినిధులు ఉప తహసీల్దార్ చంద్రశేఖరరావుకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ స్థానిక హనుమాన్(టీ) జంక్షన్ నుంచి సంతబయలు వరకు ఎన్నో ఏళ్లుగా వర్తకులు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఒకేసారి ఆర్అండ్‌బీ స్థలాన్ని ఖాళీ చేస్తే.. వ్యాపారుల ఉపాధి పోతుందన్నారు. అందువల్ల అధికారులు వెసులుబాటు కల్పించాలన్నారు. హనుమాన్ జంక్షన్ నుంచి పాత బస్ స్టాండ్ వరకు ఒకలా, పాత బస్ స్టాండ్ నుంచి డిగ్రీ కళాశాల వరకు మరో విధంగా ఆక్రమణల తొలగింపుకు కొలతలు ఇచ్చారన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ఒకే విధంగా కొలతలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, జీజీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు దురియా హేమంత్ కుమార్, వైసీపీ నాయకులు జల్లి సుధాకర్, గంగన్నపడాల్, ఉప సర్పంచ్ నూరు, వర్తకులు పాల్గొన్నారు.



నీట మునిగిన కూరకాయల పంటలను చూపిస్తున్న బాధిత రైతులు

రైతు కష్టం 'నీటి'పాలు

- వర్షంతో మునిగిన కూరగాయల పంటలు
- లబోదిబోమంటున్న దేవరాపల్లి రైతులు

దేవరాపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కూరగాయల రైతులను వర్షం ముంచేసింది. గురువారం 15 మిల్లీమీటర్ల వర్షం పడడంతో దేవరాపల్లికి చెందిన రైతుల కూరగాయల పంటలు నీట మునిగిపోయాయి. విశాఖ నగరపాలక సంస్థకు సరఫరా చేసే తాగునీటి కాలువకు ఆనుకుని ఎలిశెట్టి అప్పారావు, కె.ఎర్రునాయుడు, నెమలికంటి మహేశ్, కొరుప్రోలు రాజుబాబుకు చెందిన పంట పొలాలు నీట మునిగాయి. పొలాల్లో చేరిన నీరు పోయే మదుం మూత పడడంతో ఐదు ఎకరాల్లో వేసిన నువ్వులు, ఆనప, బరబాటి, వరి, వంగ పంటలు మునిగిపోయాయి. సుమారు రెండు లక్షల రూపాయల వరకు పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గుర్తించి తమను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

స్పందన ఫిర్యాదులపై సమగ్ర విచారణ



ఫిర్యాదుదారులను విచారిస్తున్న ప్రత్యేకాధికారి మూర్తి

చీడికాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా విచారించి బాధితులకు తగిన న్యాయం చేస్తామని మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్.మూర్తి తెలిపారు. మండలంలోని చుక్కపల్లి, చెట్టుపల్లితో పాటు మరో రెండు గ్రామాల నుంచి భూముల సమస్యలపై ఫిర్యాదులు అందాయి. వీటిపై మండల పరిషత్ కార్యాలయంలో ఇరువురు ఫిర్యాదుదారులను పిలిచి శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దార్ కిశోర్‌లింకన్, ఈవోపీఆర్డీ కామేశ్వరరావుతో పాటు వివిధ శాఖల అధికారుల సమక్షంలో బాధితులను విచారణ చేశారు. పూర్తి విచారణ అనంతరం బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎరకన్నపాలెంలో ఉపాధి కూలీల నిరసన



ఉపాధి పనులు కల్పించాలని నిరసన తెలుపుతున్న కూలీలు

మాకవరపాలెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వారానికి మూడు రోజులు మాత్రమే ఉపాధి పనులు కల్పిస్తున్నారని ఎరకన్నపాలెంలో ఉపాధి హామీ పథకం కూలీలు నిరసన తెలిపారు. శుక్రవారం ఉదయం పనుల కోసం చెరువు వద్దకు వెళ్లారు. ఈ రోజు పనులు లేవని చెప్పడంతో వారు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ వారం మూడు రోజులు మాత్రమే పనులు కల్పిస్తున్నారని పనులు చేసే చోటే వారంతా నిరసన వ్యక్తం చేశారు. వీఆర్పీ నిర్లక్ష్యం కారణంగా ఉపాధి పనులు కోల్పోతున్నామని, వీఆర్పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు చేసుకుందామంటే భూములు అన్‌రాక్ కంపెనీ భూసేకరణలో పోయాయని, ఇప్పుడు ఉపాధి పనులు లేవని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి పనులు సక్రమంగా కల్పించాలని కోరారు. దీనిపై ఏపీవో కాశీని ప్రశ్నించగా, సోమవారం నుంచి యథావిధిగా పనులు ఉంటాయన్నారు.

మొక్కలు పెంచే వారికి సత్కారం: ఎస్ఐ



పార్కు వాచ్‌మేన్ చినబాబును సత్కరిస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మొక్కలు పెంచేవారిని ప్రోత్సహించడానికి సత్కారాలు చేస్తామని ఎస్ఐ వై.తారకేశ్వరరావు చెప్పారు. మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో వందలు మొక్కలు పెంచే సంరక్షకుడు, వాచ్‌మేన్ లగుడు చినబాబును శుక్రవారం శాలువతో సత్కరించారు. అలాగే ఎస్ఐ సొంత నిధులతో సమకూర్చిన దుస్తులను చినబాబుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా వాచ్‌మేన్ కొంతకాలంగా పార్కును, పార్కులో వందల సంఖ్యలో మొక్కలను పెంచడంతో పాటు సంరక్షించడంలో చురుకైన పాత్ర పోసిస్తున్నారని కొనియాడారు. అతన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని కోరారు. అనంతరం పార్కులో కొబ్బరి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పథకంతో పంట కాలువలకు మోక్షం



పాతమల్లంపేట పంట కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

గొలుగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పలు గ్రామాల్లోని పంట కాలువలకు మోక్షం లభిస్తున్నది. ఉపాధి కూలీలు కాలువల్లో పూడికతీత పనులను చేపడుతున్నారు. మండలంలోని పాతమల్లంపేట గ్రామ రెవెన్యూలో ధారగెడ్డ ప్రధాన ఆయకట్టు కింద శుక్రవారం ఉపాధి పథకం కింద పంట కాలువల్లో తుప్పలు తొలగించి పూడికతీత పనులు చేపట్టారు. గొలుగొండ, పప్పుసెట్టిపాలెం, కొత్తఎల్లవరం, పాకలపాడు, రావణాపల్లి, చీడిగుమ్మల గ్రామాల్లోని కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు... హాజరైన సంస్థల ప్రతినిధులు, నిరుద్యోగులు

మాడుగుల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉన్నతంగా చదువుకున్నప్పటికీ ఉద్యోగాలు రాక ఖాళీగా మిగిలిపోతున్న యువతీ, యువకులకు ఉద్యోగవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సిల్క్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20 ప్రముఖ కంపెనీలతో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో భాగా వెనుకబడిన నియోగకవర్గం మాడుగులేనని చెప్పారు. ఈ నియోజకవర్గాన్ని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో అన్ని రంగాల్లో ముందుకు నడిపించే బాధ్యత తనదేనని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అత్యధిక శాతం యువతీ, యువకులు ఉన్నతమైన విద్యాభోదన చేసికూడా ఉద్యోగాలు రాలేదని, ఎంతో కష్ట పడినా తన పిల్లలకు ఉద్యోగం రాలేదని నిరాశలో ఉన్న తల్లిదండ్రులను ప్రభుత్వం గుర్తించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సిల్క్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుందన్నారు. వచ్చే నాలుగేళ్లలో నిరుద్యోగులు లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా అన్ని మండలాల్లోనూ ఎప్పటికప్పుడు మెగా జాబ్‌మేళాలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. ఈ జాబ్‌మేళాలపై నిరుద్యోగ యువతీ, యువకులకు అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత లేకుండా చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని, అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ససూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కళాశాల ఎదుట మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.రమాదేవి, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాలరాజు, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, టీడీపీ మండల కార్యదర్శి అద్దెపల్లి జగ్గారావు, పట్టణ అధ్యక్షుడు రంజిత్, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, నాయకులు డిల్లీ నానాజీ, లెక్కల కాశిబాబు, జొన్నపల్లి రమేశ్, మరువాడ ఈశ్వరావు, స్కిల్ డెవలమెంట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు

పామాయిల్ ఫ్యాక్టరీ ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమెల్యే రాజు

బుచ్చెయ్యపేట, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): ప్రమాదాల బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు పేర్కొన్నారు. మండలంలోని ఎల్‌బీపీ.అగ్రహారం రెవెన్యూ పరిధిలో గల శాంతి పామాయిల్ కంపెనీలో పల్లా అప్పన్న విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, అతని కుటుంబానికి ఫ్యాక్టరీ యాజమాన్యం భరోసా కల్పించింది. అప్పన్న కుటుంబానికి కుటుంబానికి కంపెనీ అందించిన రూ.28 లక్షల చెక్కును, అతని భార్య రేవతికి శుక్రవారం ఎమెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు విధుల్లో ఉండి మరణిస్తే, వారి కుటుంబాలకు అన్ని వేళలా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. అలాగే ప్రతి ఒక్కరూ లేబరు కార్డులు కలిగి ఉండాలని సూచించారు. దీనివల్ల ప్రమాదవశత్తు మరణించినా, అంగవైకల్యం కలిగినా వారి కుటుంబాలకు పరిహారం అందుతుందని ఆయన తెలిపారు. మృతి చెందిన పల్లా అప్పన్న కుటుంబానికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర అలవెన్సులను కూడా అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే బాధిత కుటుంబంలో ఒకరికి కంపెనీలో ఉద్యోగంతో పాటు ఇతర అలవెన్సులు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డెరెక్టర్ గేదల సత్యనారాయణ, నాయకులు గూనూరు మల్లునాయుడు, తమరాన దాసు, ఎల్లపు జగ్గారావు, మెల్లి శ్రీను, దొండా నరేశ్, కార్మిక శాఖ సహాయ కార్యదర్శి వి.సూర్యనారాయణ, ఫ్యాక్టరీ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రబంద రామాలయ ప్రారంభోత్సవం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. ఆకట్టుకున్న కోలాటాలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజు, తదితరులు

రావికమతం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేబీపీ.అగ్రహారం పంచాయతీ శివారు ఎర్రబంద గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని శుక్రవారం వైభవోపేతంగా ప్రారంభించారు. గ్రామస్థులంతా ఏకమై నిర్మించిన ఈ ఆలయాన్ని ఆరవెల్లి వెంకట రామగోపాలాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు శాస్త్రోక్తంగా మూడు రోజులుగా ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఓ పక్క వేద పండితుల మంత్రోచ్చరణలు, మరోపక్క కోలాటాలతో ఎర్రబంద గ్రామం ఆధ్యాత్మికతో భక్తి పారవశమైంది. టీడీపీ సీనియర్ నేత రౌతు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ నేత పీవీఎస్ఎన్.రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రావికమతం ఎంపీపీ ఫైల రాజు, టీడీపీ, జనసేన, వైసీపీ పార్టీల మండల అధ్యక్షులు రాజాన కొండనాయుడు, ఫైచర్ల నాయుడు, ముక్కా మహాలక్ష్మి నాయుడు, కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు, కార్యకర్తలు కోదండరాయాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.



ఆలయం వద్ద కోలాటాల ప్రదర్శన ఇస్తున్న భక్తులు

రాయితీపై పంపిణీకి మొక్కలు సిద్ధం

- ఉద్యానవన శాఖ అధికారి భానుపుష్ప

రావికమతం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన శాఖ ద్వారా రాయితీపై వివిధ రకాల పండ్ల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఉద్యానవన శాఖ అధికారిణి భాను పుష్ప శుక్రవారం తెలిపారు. అనకాపల్లి ఉద్యానవన క్షేత్రంలో 45 వేల కొబ్బరి మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒక్కొక్క మొక్కకు రైతులు రూ.90 చెల్లించాలన్నారు. అలాగే మామిడి 15 వేల మొక్కలు ఉన్నాయని, వీటికి రూ.45 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. జీడిమామిడి 8500 మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక్కొక్క మొక్కకు రూ.40 చెల్లించాల్సి ఉందన్నారు. అనకాపల్లి ఉద్యానవన శాఖ క్షేత్రంలో మొక్కలను తీసుకున్న రైతులకు పండ్ల తోటల విస్తరణ పథకంలో ప్రభుత్వం రాయితీ మంజూరు చేస్తుందన్నారు. మొక్కల కొనుగోలు సమయంలో రైతులు వారి బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జెరాక్స్‌లను అందజేయాలని సూచించారు.

పరిశుభ్రత పాటించాలి



వంటల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు

నర్సీపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో బడి పిల్లలకు వంట తయారు చేసేటప్పుడు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర స్పష్టం చేశారు. శుక్రవారం జెడ్పీహెచ్ఎస్ మెయిన్‌లో మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన సరకులు వాడాలని, స్టోర్ రూమ్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వంట వండే ముందు, తర్వాత వంట పాత్రలు శుభ్రం చేయాలన్నారు. ఆరుబయట వంట చేయకూడదని సూచించారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు గౌరీపట్నం విద్యార్థిని ఎంపిక



దీప్తి

చోడవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని పేలూరి దీప్తి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైంది. ఎనిమిదో తరగతి చదువుతున్న దీప్తి ఈ పథకానికి ఎంపిక కావడంపై హైస్కూల్ ఉపాధ్యాయుడు వి.సూర్యప్రకాశరావు, ఇతర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. దీప్తికి స్కాలర్‌షిప్ రావడం ఆనందంగా ఉందని చెప్పారు.

ఈదురుగాలుల బీభత్సం



బండారుపాలెంలో నేలమట్టమైన విద్యుత్ స్తంభం

దేవరాపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. బి.కింతాడ కొత్తూరు, కలిగొట్ల శివారు బండారుపాలెం, వేచలం, మామిడిపల్లి తదితర గ్రామాల్లో హుద్‌హుద్ తుఫాన్‌ను తలపించేలా బలమైన గాలులు వీయడంతో చెట్లు విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు నేలమట్టమయ్యాయి. ఏఈఈ కర్రి శంకరరావు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.

వెంకన్నపాలెంలో దివ్యాంగులకు గొడుగుల పంపిణీ



వెంకన్నపాలెంలో దివ్యాంగులకు గొడుగులు పంపిణీ చేసిన గోవింద్

చోడవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గోవింద్‌శుక్రవారం దివ్యాంగులకు గొడుగులు పంపిణీ చేశారు. ముందుగా గ్రామంలోని దివ్యాగులందరికీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారందరికీ గొడుగులు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఏదో ఒక గ్రామంలోని దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు చేపడతానని ఈ సందర్భంగా గోవింద్ మాస్టారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహాల మండపం ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

కె.కోటపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ గ్రామ శివాలయంలో నవగ్రహ పూజ మండపం భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, నాయకులు దనిమిశెట్టి కొండ, గొట్టిపాటి అశోక్‌కుమార్, గంగ మల్ల అయ్యప్ప, సూరిశెట్టి గణేశ్వరరావు, ఆలయ అర్చకులు కుంచంపల్లి శివరామకృష్ణ ఆధ్వర్యంలో పూడి పెద్దిశంకర్ పురోహితులు పూజాదికాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, దాతల సహాయ సహకారాలతో ఈ శివాలయంలో నవగ్రహ మండప నిర్మాణం జరిగిందని సర్పంచ్ ఎరుకునాయుడు తెలిపారు.

విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలి: ఎంఈవోలు

కె.కోటపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని మండల విద్యాశాఖ అధికారులు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని భోజన నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ పాఠశాలలు తెరుస్తున్నందున విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పరిశుభ్రతమైన వాతావరణంలో వంటలు చేయాలన్నారు. ఆరు బయట వంటలు చేయకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు వేడి పదార్థాలనే వడ్డించాలన్నారు. అనంతరం భోజన నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఎంటీటీ నాయుడు, ఎస్.సింహాచలం, వి.దేవి, లక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ

రావికమతం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మలేరియా బారిన పడకుండా ఉండాలంటే దోమ పుట్టకూడదు.. కుట్టకూడదని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొత్తకోట పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం ర్యాలీ చేశారు. మండలంలోని జెడ్.బెన్నవరం గ్రామంలో శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఎప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీరు, వర్షపు నీటిని నిల్వ చేయకూడదని చెప్పారు. అందరూ విధిగా దోమ తెరలను వినియోగించాలన్నారు. ఆరోగ్య సూత్రాలను పాటిస్తేనే వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండగలమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్ఎస్ రమణ, ఎంఎల్‌హెచ్‌వో పి.స్వరూప పాల్గొన్నారు.

ఎంకే పట్నంలో వైద్య శిబిరం

రోలుగుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంకే పట్నంలో బుచ్చెంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వారం రోజులుగా గ్రామంలో ప్రజలు జ్వరాలతో బాధపడతున్న నేపథ్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారి శ్రీనివాసరావు పాల్గొని 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. వీరిలో ఐదుగురు జ్వరాలతో ఉన్నట్టు గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే అధిక శాతం మంది రోగులు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో నూకరాజు, ఏఎన్ఎం యశోధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గడ్డి కుప్పలు దగ్ధం



మంటలు ఎగసిపడుతున్న దృశ్యం

నర్సీపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నుంచి గురందొరపాలెం వెళ్లే దారిలో శుక్రవారం మధ్యాహ్నం పిడుగు పడి రెండు గడ్డి కుప్పలు, పాక దగ్ధమయ్యాయి. శుక్రవారం ఎండ తీవ్రత కారణంగా ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వాతావరణం చల్లబడింది. మేఘాలు అలుముకొని ఉరుములు ఉరిమాయి. ఈ సమయంలో గురందొరపాలెం రోడ్డులో పిడుగు పడి పాక, గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. అక్కడ 20 పశువులను స్థానికులు కాపాడారు. అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో అగ్నిమాపక అధికారి అప్పలస్వామి, సిబ్బంది మంటలు అదుపు చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

గొలుగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరుతూ శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. కొత్తఎల్లవరం గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై స్థానిక ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతీ ఇంటి వద్ద మొక్కలు నాటాలని ఎంపీడీవో మేరీరోజీ తెలిపారు. పర్యావరణం కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి రాంబాబు పాల్గొన్నారు.

కేజే పురం వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

మాడుగుల రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజే .పురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం 15వ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం అనంతరం అన్నసమారాధన, భజన పోటీలు నిర్వహించారు. జూన్ 11న నాగవల్లి వసంతోత్సవాలు, రాత్రికి పుష్పాంజలి, ఊంజల్ పూజలు నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండారావు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు శీతల పానీయాలు

చీడికాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురువోలు గ్రామంలో టీడీపీ నాయకులు శుక్రవారం ఉపాధి కూలీలకు శీతల పానీయాలు, బిస్కెట్లు, సమోసాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బీళ్ల కోటేశ్వరరావు, పాల సంఘం అధ్యక్షురాలు ముర్రు అప్పడమ్మ, నాయకులు పోతల వెంకటరావు, జెర్రిపోతుల జగ్గారావు, జెర్రిపోతుల రాజు తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

బుచ్చెయ్యపేట, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): పని గంటల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికుల పని గంటలు ఎనిమిది నుంచి 12 గంటలకు పెంచుతూ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల పని గంటలు పెంచడం వల్ల మహిళలు కూడా ఇబ్బందులు పడతారని చెప్పారు. అలాగే రాత్రి పూట షిఫ్ట్ డ్యూటీల అమలుచేయాలని నిర్ణయించడంపై కార్మికుల పొట్ట కొట్టడమే అవుతుందని వాపోయారు. పని గంటల పెంపుపై త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన తెలిపారు. ఆయన వెంట సంఘ సభ్యులు సాంబశివరావు, అప్పారావు, యేసు, చిలికిబాబు, ఎస్.లక్ష్మి, ఈశ్వరమ్మ, దేముడమ్మ ఉన్నారు.

ప్రకృతి సేద్యంతో బహుళ ప్రయోజనాలు



సొంతంగా సేంద్రీయ ఎరువు తయారు చేసుకొంటున్న రైతులు

సేంద్రీయబాటలో 'పరవాడ' రైతు

- మండలంలోని పలు గ్రామాల్లో కూరగాయ పంటలసాగు
- తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటల దిగుబడి
- మార్కెట్‌లో డిమాండ్‌తో అధిక ఆదాయం
- ప్రోత్సహిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

పరవాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భూమి సారవంతం కావడానికి, ఆరోగ్యకరమైన పంట దిగుబడులు పొందడానికి ప్రకృతి వ్యవసాయం ఉత్తమం. ప్రభుత్వం ఈ దిశగా ప్రయత్నాలు చేయడమే కాకుండా.. సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులను వివిధ రకాల రాయితీలతో ప్రోత్సహిస్తున్నది. పరవాడ మండలంలోని పలు గ్రామాల రైతులు కొన్నేళ్ల నుంచి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగానికి స్వస్తిచెప్పి, ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. సమీపంలో వున్న విశాఖ, గాజువాక, అనకాపల్లి ప్రాంతాల్లో కూరగాయలకు డిమాండ్ వుండడంతో ఇక్కడి రైతుల్లో ఎక్కువ మంది కూరగాయ పంటలు పండిస్తున్నారు.



వెన్నెలపాలెంలో సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు



ధర్మారాయుడుపేటలో పందిరి, మల్చింగ్ పద్ధతిలో బీర సాగు..



ధర్మారాయుడుపేటలో ట్రెల్లీ మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న టొమేటో

మండలంలోని వెన్నెలపాలెం, తాణాం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ధర్మారాయుడుపేట, కొత్తవెన్నెలపాలెం, హస్తినాపురం, పాతరాజన్నపాలెం తదితర గ్రామాల్లో పలువురు రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారు. రసాయన ఎరువులను వినియోగించడం వల్ల కొంతకాలంపాటు పంట దిగుబడులు ఆశాజనకంగానే వుంటాయని, కాల క్రమేణా దిగుబడులు తగ్గిపోవడమే కాకుండా పంటలకు తెగుళ్ల బెడద పెరుగుతుందని గుర్తించారు. అంతేకాక పండించిన పంటల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం కన్నా.. సాగు వ్యయం అధికంగా వుండడంతో రైతులు నష్టపోతున్నారు. దీంతో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా.. సేంద్రీయ ఎరువులు వాడుతున్నారు. ఇందుకోసం ఆవుపేడ, ఆవు మూత్రం, వేపాకు, పచ్చిరొట్ట, పుట్టమన్ను, పెరుగు, మజ్జిగ, బెల్లం, పప్పులపొడి వంటి వాటితో ద్రవజీవామృతం, ఘన జీవామృతం తయారు చేసుకుని వినియోగిస్తున్నారు. దీంతో నేల బాగా సారవంతం కావడమే కాకుండా పండించిన పంటలకు మార్కెట్‌లో ఎక్కువ ధర లభిస్తున్నది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

40 ఎకరాల్లో కూరగాయ పంటల సాగు

మండలంలోని వెన్నెలపాలెం, తాణాం, రావాడ, వాడచీపురుపల్లి తూర్పు నాయుడుపాలెం పంచాయతీల్లో వంద మందికిపైగా రైతులు సుమారు 40 ఎకరాల్లో సేంద్రీయ పద్ధతిలో టొమేటో, చిక్కుడు, వంగ, బీర, బెండ, కాకర, ఆనప, బ్రకోలీ, గోరుచిక్కుడు, దొండ తదితర రకాల కూరగాయలు పండిస్తున్నారు. కొంతమంది రైతులు గాజువాక, అనకాపల్లి మార్కెట్లు, అచ్యుతాపురం సంతకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. కూరగాయలకు డిమాండ్ అధికంగా వున్నప్పుడు దళారులే ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు.

తక్కువ పెట్టుబడి.. మెండుగా ఆదాయం



సేంద్రీయ విధానంలో పంటల సాగును ఉద్యానవన శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఎప్పటికప్పుడు వారి సలహాలు, సూచనలు పాటిస్తూ పంటలు పండిస్తున్నాం. తక్కువ పెట్టుబడితో సంతృప్తికరమైన ఆదాయాన్ని పొందుతున్నాయి. సేంద్రీయ వ్యవసాయం... భూమికి, పంటలు పండించే రైతులకు, వాటిని ఆహారంగా తీసుకునే ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది.

వెన్నెల సోమునాయుడు,
రైతు, వెన్నెలపాలెం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ విధానంలో వ్యవసాయం చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తున్నాం. మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 93 ఎకరాల్లో సేంద్రీయ పద్ధతిన కూరగాయలు పండించేందుకు రైతులు ముందుకు వచ్చారు. రానున్న రోజుల్లో సేంద్రీయ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తాం.

ఎ.ప్రవీణలక్ష్మి,
ఉద్యానవన శాఖ ఏవో

కేజీబీవీ హాస్టళ్లలో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్, వార్డెన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో టైప్-4 కేజీబీవీ హాస్టళ్లలో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్, వార్డెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆర్.జయప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి.ఎర్రవరం (నాతవరం మండలం), కె.కోటపాడు, దార్లపూడి (ఎస్.రాయవరం మండలం), రాంబిల్లి, వి.మాడుగుల, సబ్బవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసే ఈ హాస్టళ్లలో ఆరేసిచొప్పున మొత్తం 12 పోస్టులు వుంటాయన్నారు. పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (బీఎస్సీ-మ్యాథ్స్), బీఈడీ, ఎంఏ ఎడ్యుకేషన్, ఎన్‌సీపీ-2 విద్యార్హత కలిగి ఉండాలన్నారు వార్డెన్ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ, బీఈడీ, ఎంఏ (ఎడ్యుకేషన్) ఉండాలన్నారు. జూలై ఒకటో తేదీనాటికి ఓసీ అభ్యర్థులకు 42 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీలకు 47 ఏళ్లు, విభిన్నప్రతిభావంతులు 52 సంవత్సరాల లోపు వుండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా అనకాపల్లిలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల చొప్పున గౌరవవేతనం అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

అనకాపల్లి చేరిన పారా స్పోర్ట్స్ చైతన్యయాత్ర



పారా స్పోర్ట్స్ చైతన్యయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర శుక్రవారం అనకాపల్లి చేరుకుంది. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పి.వీరుయాదవ్, దివ్యాంగ ఉద్యోగుల సంఘం ప్రతినిధి కొరుపోలు వెంకటేశ్వరరావు, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి కేఎన్‌వీ సత్యనారాయణ స్వాగతం పలికారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.అసయ్య, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి యాత్రకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అసయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో-4 ద్వారా మూడు శాతం ప్రభుత్వ ఉద్యోగాలను పారా క్రీడాకారులకు కేటాయించడం గొప్ప విషయమని అన్నారు. పారా ఒలింపిక్స్, పారా ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గనిరెడ్డి రాము, జిల్లా బధిరుల సంఘం అధ్యక్షుడు వేదుల చంద్రశేఖర్, దివ్యాంగుల సమాఖ్య చోడవరం ప్రతినిధి శరగడం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి డీసీసీబీ చేయూత



నాబార్డ్ అధికారులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు కాఫీ, మిరియాలు, పసుపు, చిరుధాన్యాలు, చింతపండు తదితర పంటలు పండించేందుకు డీసీసీబీ తగిన చేయూత ఇస్తుందని, రాయితీతో కూడి రుణసౌకర్యం కల్పిస్తుందని డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు అన్నారు. విజయవాడ నాబార్డ్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉన్నతస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. సమావేశం వివరాలను ఆయన వెల్లడించారు. డీసీసీబీ పరిధిలోని రైతులకు ఇచ్చే రుణాలపై రాయితీ పెంచాలని, చిన్న, సన్నకారు రైతులకు ఇచ్చే పంట రుణాల పరిమితి పెంచాలని సూచించినట్టు తెలిపారు. జాతీయ బ్యాంకుల వలే రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అందించేందుకు డీసీసీబీ శాఖలు పెంచాలని కోరినట్టు చెప్పారు. తన సూచనలపై నాబార్డ్ అధికారులు స్పందిస్తూ.. త్వరలోనే గిరిజన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసి తగు ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారని తాతారావు తెలిపారు. సమావేశంలో నాబార్డు వైజాగ్ సీఈవో డీవీఎస్ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

... 5వ పేజీ తరువాయి

అధికారులకు ప్రతిపాదనలు పంపాలని ఇక్కడ అధికారులు నిర్ణయించారు.

తీరుమారని మిల్లర్లు

పెద్దిపాలెంలో మూడు రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లులపై ఎప్పటికప్పుడు అధికారులు దాడులు చేసి రేషన్ బియ్యం పట్టుకుని కేసులు నమోదుచేస్తున్నారు. కొన్ని కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అయినా మిల్లుల యజమానుల తీరులో మార్పులేదు. పౌర సరఫరాల శాఖ చట్టంలో సవరణల మేరకు రైస్ మిల్లు సీజ్ చేసిన తరువాత బ్యాంకు గ్యారంటీ చెల్లిస్తే వెంటనే తెరుచుకునే వీలుంది. దీనిని ఆసరాగా చేసుకుని మిల్లుల యజమానులు అక్రమ వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలావుండగా అధికారులు దాడి చేస్తారన్న విషయం తెలుసుకున్న మిల్లర్లు అప్రమత్తమై రెండు, మూడు లారీల్లో బియ్యం మరో ప్రాంతానికి తరలించినట్టు చెబుతున్నారు.

యోగాకు 5 లక్షల మంది సమీకరణ

- విశాఖపట్నం జిల్లా నుంచి 3.5 లక్షలు, అనకాపల్లి నుంచి లక్ష, విజయనగరం నుంచి 30 వేలు, శ్రీకాకుళం నుంచి 20 వేల మంది..
- ప్రతి ఒక్కరికి టీషర్టు, మ్యాట్
- తరలింపునకు 8,000 బస్సులు

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఐదు లక్షల మంది పాల్గొనేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. విశాఖపట్నం జిల్లా నుంచి మూడున్నర లక్షల మందిని, అనకాపల్లి జిల్లా నుంచి 1.5 లక్షల మందిని, విజయనగరం నుంచి 30 వేలు, శ్రీకాకుళం జిల్లా నుంచి 20 వేల మందిని సమీకరించనున్నారు. ఐదు లక్షల మందికీ టీషర్టు (యోగా ప్రదర్శనతో కూడిన లేబుల్), మ్యాటు సరఫరా చేస్తారు. టీషర్టులు, మ్యాట్లు ఢిల్లీ నుంచి రెండు రోజుల్లో నగరానికి రానున్నాయి. వాటిని ఏయూ జిమ్నాజియం స్టేడియంలో భద్రపరచి, 15వ తేదీ తరువాత అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తారు. యోగా ప్రదన్శనకు ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్ పొడవునా 29 కంపార్టుమెంట్లు ఏర్పాటుచేస్తున్నారు. మరో నాలుగు ఇండోర్ స్టేడియాలు గుర్తించారు. నగరం, పొరుగు జిల్లాల నుంచి అభ్యాసకులు 21వ తేదీ తెల్లవారుజామున ఐదు గంటలకల్లా బీచ్ రోడ్డులో కేటాయించిన కంపార్టుమెంట్లకు చేరుకోవాలి. ఇందుకు ఆరు వేల ఆర్టీసీ బస్సులు, మరో రెండు వేల ప్రైవేటు బస్సులు, పెద్ద సంఖ్యలో ఆటోలు, చిన్నపాటి వాహనాలు ఏర్పాటుచేస్తున్నారు. వాటి కోసం బీచ్ పొడవునా 51 పార్కింగ్ కేంద్రాలు గుర్తించారు. నగరంలో జన సమీకరణ బాధ్యతలు అన్ని ప్రభుత్వ శాఖలు, జీవీఎంసీ యూసీడీ, పాఠశాల విద్యా శాఖ, ఇంటర్ బోర్డు, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు, వర్సిటీ అధికారులకు అప్పగించారు. 21వ తేదీ ఉదయం 7.15 గంటలకు ప్రారంభం కానున్న ప్రదర్శన 8.15 గంటలకు ముగుస్తుంది.

ఆగిన రోడ్డు పనులు

... 5వ పేజీ తరువాయి

ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.12 కోట్ల అంచనాలతో గత ఏడాది డిసెంబరులో టెండర్లు ఖరారు చేశారు. కాంట్రాక్టర్ వెంటనే పనులు మొదలుపెట్టారు. ఈ ఏడాది జూన్‌నాటికి పనులు పూర్తిచేయాలన్నది అగ్రిమెంట్. అవసరమైనచోట రోడ్డుకు ఇరువైపులా మీటరు చొప్పున రెండు అడుగుల మేర తవ్వేసి, అందులో వెట్‌మిక్స్ వేసి రోలింగ్ చేయాలి. కొన్నిచోట్ల సీసీ రోడ్డు నిర్మించాలి. తరువాత బీటీ రోడ్డు వేయాలి. రహదారిని రెండు భాగాలుగా చేసి, ఒకవైపు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పనుల కోసం తీసుకువచ్చిన ఇసుక, కంకర, సిమెంట్ బస్తాలను రోడ్డుపైనే వుంచేశారు. అసలే రోడ్డు చిన్నది కావడం, పైగా నిర్మాణ సామగ్రిని రోడ్డుపైనే వుంచడం, ఆ సమయంలో వర్షాలు కూడా లేకపోవడంతో దుమ్ము, ధూళి ఎగిసిపడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు... ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి వుంది. వాస్తవంగా ఈ నెలాఖరునాటికి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తికావాలి. కానీ ఇంతవరకు 30 శాతం కూడా కాలేదు. కారణం ఏమిటో తెలియదుగానీ వారం రోజుల క్రితం కాంట్రాక్టర్ పనులు ఆపేశారు.

పనులు నిలిచిన మాట వాస్తవమే

విద్యాసాగర్, ఈఈ, ఆర్‌అండ్‌బీ

వడ్డాది నుంచి తాటిపర్తి వరకు రోడ్డు అభివృద్ధి, విస్తరణ పనులు కొద్దిరోజులుగా నిలిచిపోవడం వాస్తవమే. నాణ్యతా విభాగం (క్వాలిటీ కంట్రోల్) ఇంజనీర్లు ఇటీవల పనులను పరిశీలించి వెళ్లారు. వడ్డాది నుంచి ఘాటీ రోడ్డు వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు పనులకు క్వాలిటీ విభాగం నుంచి అనుమతులు వచ్చాయి. ఘాటీ రోడ్డు నుంచి తాటిపర్తి వరకు రోడ్డు పనులకు క్వాలిటీ విభాగం నుంచి త్వరలోనే అనుమతులు వస్తాయి.

డీఎస్సీ రాత పరీక్షలు ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

నిర్వహించారు. ఉదయంపూట పరీక్షకు 1,435 మందికిగాను 1,278 మంది, మధ్యాహ్నం 1,012 మందికిగాను 885 మంది హాజరయ్యారు. అభ్యర్థులను గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతించారు. డీఈవో ప్రేమ్‌కుమార్ ఒక కేంద్రాన్ని తనిఖీ చేశారు.



ఎన్ఎస్‌టీఎల్ సమీపంలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు

ఆరు నెలల్లో ఉత్పత్తులు

... 5వ పేజీ తరువాయి

కొణతాల రామకృష్ణతో కలిసి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ పార్కులో యూనిట్ల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 171 మందికి అనుమతులు మంజూరు చేసినట్టు చెప్పారు. చిన్న పరిశ్రమల ద్వారానే ఎక్కువ మందికి ఉపాధి కల్పించడానికి అవకాశం వుంటుందన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నదని కలెక్టర్ తెలిపారు. కోడూరు పార్కులోని యూనిట్లలో చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతి కుటుంబం నుంచి ఒకరికి ఉపాధి కల్పించేలా చూడాలని ఔత్సాహికులను కోరారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నదని, ఇందులో భాగంగా అనకాపల్లి నియోజకవర్గానికి సంబంధించి కోడూరులో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పారిశ్రామిక రంగంలో 70 శాతం ఉద్యోగాలు చిన్న పరిశ్రమలే కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్.నరసింహారావు, తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

క్రైం... crime news

మేడపై నుంచి పడి వృద్ధుడి మృతి



లగుడు అప్పలనాయుడు (ఫైల్‌ఫొటో)

కృష్ణాదేవిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మేడపై నుంచి కాలు జారి పడి తీవ్రంగా గాయపడిన వృద్ధుడు వైద్యసేవలు పొందుతూ మృతిచెందినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా వున్నాయి. గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి చెందిన లగుడు అప్పలనాయుడు(66) బుధవారం తెల్లవారుజామున మూత్ర విసర్జన కోసం లేచి మేడపై నుంచి కిందకు దిగే క్రమంలో కాలుజారి సీసీరోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. ఆ ఇంటి మేడపై పిట్టగోడ లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే 108లో నర్సీపట్నం తీసుకువెళ్లగా.. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యసేవల నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో వైద్యసేవలు పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. అప్పలనాయుడు భార్య సత్యవతి ఫిర్యాదుతో ఎస్ఐ వై.తారకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎలమంచిలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామ్‌నగర్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

రామ్‌నగర్ టిడ్కో కాలనీకి చెందిన కుండల లోకనాథం (57) గురువారం హైవే పక్కన ఉన్న ఒక పెట్రోల్ బంకులో తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టించుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. అనకాపల్లి వైపు నుంచి తుని వైపు వెళుతున్న మరో ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొన్నాడు. దీంతో లోకనాథం తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

భర్త, అత్తపై వేధింపుల కేసు

అనకాపల్లి టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వివాహితను వేధిస్తున్నట్టు అందిన ఫిర్యాదుపై భర్త, అత్తలపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. అనకాపల్లి మండలం తుమ్మపాలకు చెందిన చేకూరి రఘునాథవర్మ, దుర్గాభవానీలకు 2022లో వివాహం జరిగింది. కొద్ది రోజుల తరువాత నుంచే అదనపు కట్నం తీసుకురావాలని దుర్గాభవానీని భర్తతోపాటు అత్త లక్ష్మి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. ఈ బాధలు తట్టుకోలేక లక్ష్మీదేవిపేటలోని అమ్మమ్మ ఇంటికి (తల్లిదండ్రులు లేరు) వెళ్లిపోయి అక్కడే వుంటున్నది. భర్త ఇంటిలో వున్న తన వస్తువులు తెచ్చుకోనివ్వడం లేదంటూ దుర్గాభవాని కోర్టులో కేసు వేసింది. ఈమెకు సంబంధించిన వస్తువులను తీసుకోవడానికి మెట్టినింటి వారు అనుమతి ఇవ్వాలంటూ గత నెల 15వ తేదీన కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో 17వ తేదీన అక్కడకు వెళ్లగా.. భర్త, అత్త సామాన్లు ఇవ్వకపోవడమే కాకుండా దూషించి, చంపుతామని బెదిరించారు. ఈ విషయంపై కుల పెద్దల వద్ద పంచాయితీ పెట్టినా మెట్టింటి వారు స్పందించలేదు. దీంతో దుర్గాభవానీ గురువారం రాత్రి రఘునాథవర్మ, లక్ష్మిలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.

ఖజానా శాఖలో 34 మంది బదిలీ

- నిబంధనలకు విరుద్ధంగా చేశారంటూ ఆరోపణలు

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఖజానా శాఖ పరిధిలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా శుక్రవారం బదిలీలు చేపట్టారు. అన్ని కేడర్‌లు కలిపి 34 మందిని బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేశారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఒకేచోట ఐదేళ్లు సర్వీస్ పూర్తిచేసిన వారిని బదిలీ చేయాలి. కానీ విశాఖలో ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన ఉద్యోగులు పలువురిని బదిలీల నుంచి తప్పించారని చెబుతున్నారు. అదేవిధంగా ఆప్షన్లకు భిన్నంగా వేరొకచోటకు బదిలీ చేశారని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగ సంఘం బేరర్ల పేరుతో కొందరు బదిలీ నుంచి మినహాయింపు పొందారని, దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదుచేస్తామని తెలిపారు. బదిలీల్లో జిల్లా అధికారులను కాదని రాష్ట్ర స్థాయిలో కొందరు జోక్యం చేసుకోవడంతో గందరగోళం ఏర్పడిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

కృష్ణాపురం వద్ద బస్సు బోల్తా

... 5వ పేజీ తరువాయి

విధులకు హాజరయ్యే కార్మికుల కోసం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఒక బస్సు ఏటికొప్పాకలో బయలుదేరింది. తరువాత పీఎస్ఆర్‌పేట, పులపర్తి, కృష్ణాపురం గ్రామాల్లో సుమారు 30 మంది మహిళా కార్మికులు ఎక్కారు. తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో కృష్ణాపురం శివారులో బస్సు అదుపుతప్పి, పక్కనే వున్న పంటపొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గంట్ల లక్ష్మి, మోటూరు విజయ, తవ్వా లక్ష్మి, టి.పార్వతి తీవ్రంగా గాయపడ్డారు. మరో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కృష్ణాపురం గ్రామానికి చెందిన పలువురు హుటాహుటిన వచ్చి, క్షతగాత్రులను బస్సులో నుంచి బయటకు తీసి, సపర్యలు చేశారు. తీవ్రంగా గాయపడిన నలుగురిని అనకాపల్లిలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి, స్వల్ప గాయాలైనవారిని అచ్యుతాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ ఉపేంద్ర సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఆర్‌అండ్‌బీ స్థలానికి రక్షణ కరవు

... 5వ పేజీ తరువాయి

నిర్మాణ పనులు మొదలు పెట్టారు. తరువాత డిసెంబరు నెలలో ఆర్‌అండ్‌బీ డీఈ, జేఈ సంయుక్తంగా ప్రైవేటు వ్యక్తి తవ్వేసిన పునాదులు పరిశీలించారు. స్థలం యజమానిని పిలిచి ప్రశ్నించగా.. నిర్మాణ సామగ్రి రవాణా కోసం పునాదిని తీసేయాల్సి వచ్చిందని, తన స్థలంలో నిర్మాణ పనులు పూర్తయిన తరువాత పునాదులను తిరిగి కట్టిస్తానని చెప్పారు. కానీ ఇంతవరకు పునర్నిర్మించలేదు. పైగా ఆర్‌అండ్‌బీ స్థలం, దాని వెనక ఉన్న ప్రైవేటు స్థలాన్ని కలిపి మెయిన్ రోడ్డు వైపు ముళ్ల కంచె వేశారు. దీనివల్ల ప్రభుత్వ స్థలం, ప్రైవేటు స్థలం కలిసి పోయి ఉన్నాయి. నర్సీపట్నంలో మెయిన్ రోడ్డుని ఆనుకొని ఉన్న స్థలాలకు బాగా డిమాండ్ ఉంది. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు సెంటు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతున్నది. నర్సీపట్నం-చింతపల్లి మెయిన్ రోడ్డులో సెంటు రూ.30 లక్షలకు తక్కువ లేదు. ఈ ప్రకారం ఆర్‌అండ్‌బీ స్థలం విలువ రూ.3 కోట్లకుపైగా వుంటుంది. ఇంత విలువైన స్థలాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ నారాయణరెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తొలగించిన పునాది గోడలను తిరిగి నిర్మించాలని ప్రైవేటు స్థలం యజమానికి చెబుతామని, సర్వే చేయించి ఆర్‌అండ్‌బీ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వడగాడ్పులు.. వర్షాలు!

... 5వ పేజీ తరువాయి

తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం వర్షం పడింది. దేవరాపల్లి మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. బి.కింతాడ, కొత్తూరు, కలిగొట్ల శివారు బండారుపాలెం, వేచలం, మామిడిపల్లి, తదితర గ్రామాల్లో బలమైన గాలులు వీచడంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. బండారుపాలెంలో ట్రాన్స్‌ఫారం ధ్వంసమైంది. ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539